

రథోత్సవాల సందర్భంగా

కూర్మావతారంలో జగన్నాథస్వామి

టర్నర్ చౌల్ట్రీలో కొలువుదీరిన జగన్నాథుడు ఆదివారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వైఖానస ఆగమ సంప్రదాయంలో అర్చకులు స్వామికి అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం చిన్నారుల కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కాగా సోమవారం జగన్నాథస్వామి వరాహావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. - మహారాణిపేట, ఆంధ్రజ్యోతి

నేడు కలెక్టరేట్, జీవీఎంసీలో పీజీఆర్ఎస్

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చిన కాల్‌సెంటర్ 1100 నంబరుకు సంప్రదించి వినతులను నమోదు చేసుకోవచ్చన్నారు. అధికారులంతా నిర్ణీత సమయానికి కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. కాగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పాత కౌన్సిల్‌హాల్‌లో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తామని మేయర్ పీలాశ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

ఆటోనగర్‌పైనా వైసీపీ అక్కసు!

పరిహారం పంపిణీ నిధులు దారి మళ్లింపు

- రైతులకు రూ.11.09 కోట్లు బకాయిలు
- ఆనందపురంలోని కణమాంలో ఆటోనగర్ ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వం చర్యలు
- గ్రామంలోని సర్వేనంబరు 50లో 157.7 ఎకరాలు సేకరించాలని నిర్ణయం
- పరిహారం కోసం కలెక్టర్ ఖాతాకు రూ.32.64 కోట్లు జమ చేసిన ఏపీఐఐసీ
- ఆ నిధులను దారి మళ్లించిన వైసీపీ ప్రభుత్వం



కణమాంలో ఆటోనగర్‌కు కేటాయించిన కొండవాలు ప్రాంతం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలం కణమాంలో ఆటోనగర్ ఏర్పాటుకు ఏపీఐఐసీ ఇచ్చిన నిధుల నుంచి సుమారు రూ.12 కోట్లను గత ప్రభుత్వ హయాంలో దారి మళ్లించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దీంతో రైతులకు చెల్లించేందుకు నిధుల కొరత ఏర్పడింది. దీంతో పాటు రైతులకు పరిహారం పంపిణీ జాబితాలో బినామీల పేర్లు చేర్చారని, దీనిపై విచారణ చేపట్టాలని గ్రామ సర్పంచ్ తాజాగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది.

ఆనందపురం మండలం కణమాం గ్రామం సర్వేనంబరు 50లో 200 ఎకరాల కొండ, దానికి ఆనుకుని ఉన్న వాలు ప్రాంతంలో 157.7 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటుకు 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనికి అనుగుణంగా కొండవాలు ప్రాంతంలో 157.7 ఎకరాల్లో ఉన్న రైతుల వివరాలు సేకరించారు. డీపట్టా ఉంటే ఎకరాకు రూ.49 లక్షలు, రైతు ఆధీనంలో ఉండి రెవెన్యూ రికా ర్డుల్లో నమోదైతే రూ.19 లక్షలు, రెవెన్యూ రికార్డుల్లో నమోదుకానప్ప టికీ రైతుల ఆధీనంలో ఉంటే ఎకరాకు రూ.తొమ్మిది లక్షు చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఆటోనగర్ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన బాధ్యతలను ఏపీఐఐసీకి అప్ప గించారు. దీనికి అనుగుణంగా ఏపీఐఐసీ జిల్లా కలెక్టర్ సీఎఫ్ఎంఎస్ ఖాతాకు రూ.32.64 కోట్లు జమ చేసింది. దీంతో సర్వే నంబరు 50లోని 157.7 ఎకరాల్లో ఉన్న రైతులను రెవెన్యూ అధికా

- ఆరేళ్లుగా ముందుకు సాగని పనులు
- జాబితాలో బినామీలపై విచారణకు సర్పంచ్ డిమాండ్

రులు గుర్తించి జాబితా సిద్ధంచేశారు. వీరికి పరిహారం కోసం సుమారు రూ.20 కోట్లు డ్రాచేశారు. రైతులకు మూడు కేటగిరీల వారీగా నగదు పంపిణీచేశారు. దీనిపై వైసీపీ నేతలు ఏడాదిన్నర క్రితం కణమాంలో విజయోత్సవ సభ కూడా నిర్వహించారు. అయితే రైతులకు చెల్లించాల్సిన రూ.11.09 కోట్లు తరువాత ఇస్తామని చెప్పి, ఆ విషయమే మర్చిపోయారు. ఏపీఐఐసీ డిపాజిట్ చేసిన మొత్తం రూ.32.64 కోట్లు రైతులకు పరిహారం ఇచ్చేందుకు సరిపోతాయి. కానీ గత ప్రభుత్వం సీఎంఎఫ్ఎస్‌కు జమ చేసిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించింది.

వెలుగులోకి రాని వాస్తవాలు

ఈ విషయంపై అప్పట్లో పాలకులు, రెవెన్యూ అధికారులు వాస్తవాలు బయటపెట్టలేదు. అయినా ఆటోనగర్ ఏర్పాటుకు పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు రావడంతో పరిహారం అందని రైతులు ఏపీఐఐసీ అధికారులను అడ్డుకున్నారు. ఈలోగా ఎన్నికలు వచ్చి కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. దీంతో ఆటోనగర్ ఏర్పాటుపై సంబంధిత అసోసియేషన్‌సభ్యులు ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఉన్నతస్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ... మిగతా 6వ పేజీలో

వినియోగదారుల్లో చైతన్యం అవసరం

మోసాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు

- చికెన్, మటన్ విక్రయాల్లో తేడాలపై కేసులు నమోదు
- పెట్రోల్ బంకుల్లో ఐదు లీటర్ల క్యాన్లతో చెక్ చేసుకునే వీలు
- ప్యాకేజీ నిబంధనలు పాటించకపోతే జరిమానా
- అధికారులు తనిఖీ చేసి ఇచ్చిన మెషీన్లు, తూకపు రాళ్లనే వినియోగించాలి



రవికుమార్

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

- తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):

వినియోగదారుల్లో చైతన్యం ఉండాలని, మోసం జరిగితే ఫిర్యాదు చేయాలని తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్ సూచించారు. చికెన్, మటన్ విక్రయాల్లో మోసాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపైనా ప్యాకేజీ నిబంధనలుండాలని, మోసాలపై ఫిర్యాదు చేయాలని తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.థామస్ రవికుమార్ పేర్కొన్నారు. ఈ శాఖ పరిధిలో కార్యకలాపాలు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విధానంపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

తూనికలు, కొలతలశాఖ రెండురకాల కార్యకలాపాలను నిర్వహిస్తుంది. మొదటిది ప్రమాణాలను సరిచేయడం. ఇందుకోసం వ్యాపారం చేసే వారి తూనికలు, కొలతల సామగ్రిని తనిఖీ చేయడం. రెండోది ఎన్‌ఫోర్స్‌మెంట్. నిబంధనలను పాటిస్తున్నారా.? లేదా.? తనిఖీ చేసి, మోసం చేసేవారిపై చర్యలు తీసుకుంటాం. చిన్నపాటి కూరగాయల దుకాణం నుంచి పరిశ్రమల వరకు తూనికలు, కొలతల కార్యకలాపాలను పర్యవేక్షిస్తాం. యజమానులు తప్పనిసరిగా రెండేళ్లకు ఒకసారి నిబంధనలకు అనుగుణంగా కాటాలు, మెషీన్లు తనిఖీ చేయించుకుని ధ్రువపత్రం తీసుకోవాలి. ఈ ధ్రువపత్రం లేని వాటిని వినియోగిస్తే ఫిర్యాదు చేయాలి.

నగరంలో చికెన్, మటన్ విక్రయాల్లో ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయ ని ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్నిచోట్ల ఈ శాఖ ముద్ర వేసి ఇచ్చిన పరికరాలను వినియోగించడం లేదు. వారిపై చర్యలు తీసుకుంటున్నాం. డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో విక్రయించే కొన్నిరకాల వస్తువులపై ప్యాకేజీ నిబంధనలు లేవనే ఫిర్యాదులున్నాయి. మాల్స్‌లోని ర్యాక్స్‌లో సరకులు మార్చకుండా పాత ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులున్నాయి. థియేటర్స్‌లో తినుబండారాలకు అధిక ధరలు వసూలు చేస్తున్నారని, రైల్వేస్టేషన్, బస్టాండ్స్‌లో ఆహార ఉత్పత్తులను ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల రైల్వేస్టేషన్, బస్టాండ్స్‌లో తనిఖీలు చేపట్టి దుకాణదారులకు జరిమానా వేశాం.

కూరగాయల నుంచి బంగారం వరకు కొనుగోలు చేసే ప్రతి వస్తువు బరువులో తేడా ఉన్నా, పెట్రోల్ బంకుల్లో ... మిగతా 6వ పేజీలో

కౌన్సెలింగ్‌లో గందరగోళం

- మూడు ఆప్షన్ల విధానానికి వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు ససేమిరా
- అధికారుల తీరుకు నిరసనగా కౌన్సెలింగ్ బహిష్కరణ

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):

వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీల బదిలీల కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. కౌన్సెలింగ్‌లో మూడు ఆప్షన్లు ఇవ్వాలని అధికారులు కోరడంతో వారంతా అభ్యంతరం తెలిపి, కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో యూసీడీ పీడీ సత్యవేణి ఆధ్వర్యంలో ఆదివారం వార్డు సచివాలయం సంక్షేమ కార్యదర్శుల కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. నగర పరిధిలోని 438 మంది సంక్షేమ కార్యదర్శులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వారిని పోస్టింగ్ కోసం మూడు సచివాలయాలు ఆప్షన్ ఇవ్వాలని, వాటిలో అందుబాటులో ఉన్న చోటకు బదిలీ చేస్తామని అధికారులు వివరించారు. దీనికి కార్యదర్శులు ... మిగతా 6వ పేజీలో



కౌన్సెలింగ్ బహిష్కరించి బయటకు వెళ్లిపోతున్న వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు

విశాఖ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషిచేయండి

- మేయర్ పీలాకు సీఎం చంద్రబాబు సూచన

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరం అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా పనిచేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మేయర్లు, ఎమ్మెల్సీలతో ఆదివారం సీఎం సమావేశమయ్యారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపనులు, భవిష్యత్తు కార్యాచరణపై మేయర్ ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా విశాఖను అభివృద్ధి చేస్తున్నామని, నగరాభివృద్ధికి ప్రణాళికాద్ధంగా కృషిచేయాలని మేయర్‌ను ఆదేశించారు.



సీఎం చంద్రబాబునాయుడు, పల్లాతో కలిసి భోజనం చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

కేజీహెచ్‌లో నెఫ్రాలజీ పీజీ సీట్లకు ముప్పు?

- ప్రొఫెసర్ బదిలీతో రద్దు ప్రమాదం
- మూడేళ్లుగా అసోసియేట్ పోస్టు ఖాళీ
- విభాగానికి ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లే దిక్కు
- ఉన్నతాధికారుల దృష్టికి సమస్య




విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):

నిరుపేదల పెద్దాస్పత్రి కేజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగంలో పీజీ సీట్లు ప్రమాదంలో పడ్డాయి. ఈ విభాగానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఏడాదికి మూడు పీజీ సీట్లను మంజూరుచేసింది. ఇవి కొనసాగాలంటే ఈ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్ ఉండాలి. తాజాగా చేపట్టిన వైద్యుల బదిలీల్లో ఇక్కడి సీనియర్ ప్రొఫెసర్ కుబదిలీ అయింది. అయితే ఆ స్థానంలో ఎవరూ రాలేదు. మరోవైపు మూడేళ్లుగా అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఎప్పటికప్పుడు ఈ పోస్టుల వివరాలను తీసుకుంటుంది. ఖాళీ పోస్టుల వివరాలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళితే కేటాయించిన మూడు పీజీ సీట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. ఏడాదికి మూడు చొప్పున మూడేళ్లకు 12 సీట్లను విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందని, ఇది ఈ విభాగంలోని వైద్యసేవలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని చెబుతున్నారు.

ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈ విభాగంలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లే వైద్య సేవలు అందించాల్సి వస్తోంది. ఓపీ, ఐపీ సేవలతో పాటు అవసరమైన శస్త్రచికిత్సలను నిర్వహించాల్సి వస్తోంది. ఈ విభాగానికి ప్రతిరోజూ 250 మంది వరకు రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగా మరో 60 మంది ఉన్నారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో 20 మంది డయాలసిస్ చేయించుకుంటారు. ప్రైవేటు సంస్థ 100 మందికి డయాలసిస్ చేస్తుంది. వీటన్నింటినీ ఈ విభాగానికి చెందిన వైద్యులే పర్యవేక్షించాలి. తాజాగా ప్రొఫెసర్ పోస్టు ఖాళీతో పీజీ సీట్లకు గండం పొంచి ఉండగా, రోగులకు అందించే వైద్య సేవలపైనా ప్రభావం పడుతోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. దీనిపై ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవిని వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, పదోన్నతుల తరువాత ప్రొఫెసర్ పోస్టును భర్తీచేసే అవకాశం ఉందన్నారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు
- సన్నాహాలు చేస్తున్న అధికారులు
- ఈఏపీసెట్ ర్యాంకర్లకు అవకాశం
- దక్షిణ భారతదేశంలో తొలి వర్సిటీగా గుర్తింపు



విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మరో కొత్త కోర్సును ప్రారంభించేందుకు చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణమైన కోర్సులను ప్రవేశపెట్టేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) యత్నిస్తోంది. అందులో భాగంగానే అతికొద్ది విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ జాబితాలో ఏయూ చోటు దక్కించుకుంది.

దక్షిణ భారతదేశంలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు నిర్వహించనున్న తొలి వర్సిటీగా ఏయూ గుర్తింపు దక్కించుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కోర్సును 60 సీట్లతో ప్రారంభించేందుకు వర్సిటీకి అవకాశం దక్కింది. తొలి ఏడాది 30 సీట్లలో ప్రవేశాలు ... మిగతా 6వ పేజీలో

ప్రాణం తీసిన ఈత సరదా

- గెడ్డలో మునిగి ఒకరి మృతి
- మరొకరి పరిస్థితి విషమం

మాడుగుల రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):

ఈత సరదా ఒకరి ప్రాణాలు బలిగొంది. మరొకరి పరిస్థితి విషమంగా మార్చింది. ఈ ఘటన మాడుగుల మండలం గరికబంద సమీపాన బిల్లలపాలెం వద్ద తాచేరు గెడ్డలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

విశాఖపట్నానికి చెందిన రంభ ఖ్యాతితేజ, ఆర్.కె.కౌశిల్, లెక్కల కుమారస్వామి, పైల బాలకృష్ణ, తాటికొండ సురేశ్‌లు స్నేహితులు. కుమారస్వామిది మాడుగుల. విశాఖలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఐదుగురు స్నేహితులు మాడుగులలో ఓ శుభకార్యానికి ఆదివారం కారులో వచ్చారు. మధ్యాహ్న భోజనం చేసిన తరువాత పాడేరు, అరకు మీదుగా విశాఖ వెళ్దామని నిర్ణయించుకున్నారు. మాడుగుల నుంచి కారులో పాడేరు వెళుతుండగా ఏజెన్సీ ముఖద్వారం గరికబంద నుంచి పక్కగా సుమారు కిలోమీటరు దూరంలోని బిల్లలపాలెం వద్ద గల తాచేరు గెడ్డలో సరదాగా ఈత కొడదామని వెళ్లారు. తాటికొండ సురేశ్ మినహా మిగిలిన నలుగురు గెడ్డలోకి దిగారు. కుమారస్వామి, బాలకృష్ణ ఒక దగ్గర, కొంచెం దూరంలో కౌశల్, మరికొంత దూరంలో ఖ్యాతితేజ స్నానాలు చేస్తున్నారు. లోతు ఎక్కువగా, ఊబి ఉన్న ప్రాంతంలో ఖ్యాతితేజ మునిగిపోయాడు. కౌశల్ కూడా మునిగిపోతుండడాన్ని గమనించి కుమారస్వామి, బాలకృష్ణ రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఖ్యాతితేజను కూడా అతికష్టమ్మీద బయటకు తీసుకువచ్చినా అప్పటికే నీరు ఎక్కువగా తాగేయడంతో అపస్మారక స్థితికి చేరాడు. స్థానికుల సాయంతో ఖ్యాతితేజ, కౌశల్‌లను స్నేహితులు మాడుగుల ... మిగతా 6వ పేజీలో



ఖ్యాతితేజ మృతదేహం

పోలీసుల నాకాబందీ

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి రవాణాకు అడ్డుకట్టవేసేందుకు సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు శనివారం రాత్రి నాకా బందీ నిర్వహించారు. నగరంలోని పోలీసులు 48 బృందాలుగా ఏర్పడి 48 ముఖ్య కూడళ్లలో ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా 115 వాహనాలను తనిఖీ చేయగా 60 ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, 16 వాహనాలకు నంబరు ప్లేట్లు సరిగా లేకపోవడం, మూడు ద్విచక్రవాహనాలపై ట్రిపుల్‌రైడింగ్, 12 మంది సెల్‌ఫోన్ డ్రైవింగ్, మరో 19 వాహనాలపై వివిధ కారణాలతో కేసులు నమోదుచేశారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అస్తవ్యస్తంగా వీధిలైట్ల నిర్వహణ

ఎండాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులో వీధి లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. గొల్లల ఎండాడలో ఉన్న దసపల్లా లేఅవుట్ ప్రాంతంలో పోల్ నెంబర్లు 615/బి/1/1, 307బి/5/2తో పాటు రాజీవ్‌నగర్, గొల్లల ఎండాడ, వైఎల్‌పీ లేఅవుట్, ఎండాడ పెట్రోల్ బంకు వెనుక భాగంతో పాటు దుర్గాలమ్మ గుడికి వెళ్లే ప్రాంతాల్లో లైట్లు సక్రమంగా వెలగడం లేదు. దీంతో స్థానికులు రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

భీమునిపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా జరగనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు తెలిపారు.ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ చదివిన వారు హాజరు కావచ్చునని చెప్పారు. పూర్తి వివరాలకు 9014758949 సెల్ నంబరును సంప్రతించాలని ఆయన సూచించారు.

పింఛన్ల సమస్య పరిష్కరించాలని వినతి

తగరపువలస, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లులో రిటైర్డ్ అయిన కార్మికులకు తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని మిల్లు పింఛన్‌దారుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జూట్ సమస్యల పరిష్కారానికి కార్మిక శాఖాధికారులు అంగీకారం తెలియజేశారని, పింఛన్‌దారుల సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. చాలామంది రిటైర్డ్ కార్మికులు పింఛన్ కోసం దరఖాస్తు చేసి పదేళ్లు అయినా పింఛన్ ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై పాలకులు, అధికారులు చొరవ తీసుకోవాలని వారు కోరారు.

వివాదాస్పద స్థలంలో లేఅవుట్‌పై ఫిర్యాదు

తగరపువలస, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలసలోని సర్వే నంబరు 73,74లో ఉన్న వివాదాస్పద భూముల్లో అనధికారికంగా వేస్తున్న లేఅవుట్‌పై జీరు ప్రసాదరెడ్డి భీమిలి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో 20 ఎకరాలకు వారసులు వేరే ఉన్నారని, కానీ వారికి సంబంధం లేని వారి నుంచి స్థలాన్ని కొనుగోలు చేసినట్టు రికార్డులు చూపించి లేఅవుట్ వేస్తున్నారని తెలిపారు. ఈవిషయమై పోలీసులు విచారణ చేస్తున్నారు.

టీడీఆర్‌లకు 14 దరఖాస్తులు

మధురవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రహదారి ఏర్పాటుతో తమ భూములు కోల్పోయామని 14 మంది వీఎంఆర్‌డీఏకు దరఖాస్తు చేశారు. జీవీఎంసీ అధికారులు విచారణ చేపట్టి 8 మంది దరఖాస్తుదారులకు టీడీఆర్‌లు మంజూరు చేయడానికి సిద్ధమయ్యారు. భూములు కోల్పోయిన బాధితుల సమక్షంలోనే రహదారి ఏర్పాటుకు ఇచ్చిన భూమిని ఆదివారం వారు పరిశీలించారు. ఈమేరకు నగరంపాలెం రహదారికి సమీపంలో ఉన్న గెడ్డను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ధర్నా



ఆందోళన చేస్తున్న స్థానికులు

మధురవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఐదో వార్డు మారికివలస సమీపంలోని శారదానగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని స్థానికులు ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారదానగర్ సమీపంలో ఇప్పటికే మద్యం దుకాణం ఉందని, మరో దుకాణం ఏర్పాటుకు యజమానులు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. మరో దుకాణం ఏర్పాటు చేస్తే ఇబ్బందులకు గురవుతామని, వెంటనే ఆ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు.



వైకుంఠనారాయణుడుకి స్నపనం చేస్తున్న వైదికులు



కొండపై పోస్తున్న పాయసం

వైభవంగా వరద పాయసం ఉత్సవం

వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుక

సింహాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈశాన్య దిక్కులోని వైకుంఠనారాయణుని సన్నిధిలో వరద పాయసం ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రధాన ఆలయంలో ప్రభాతారాధనలు ముగిసిన తరువాత దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులతో పాటు ఆలయ వైదిక సిబ్బంది వైకుంఠ నారాయణుని సన్నిధానానికి చేరుకున్నారు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం గంగధార జలాలను తీసుకువచ్చి వాటితో పాటు పంచామృతాలతో వైకుంఠవాసునికి ప్రత్యేక స్నపన తిరుమంజనాన్ని జరిపారు. ఆలయ పండితులు విరాట్ పర్వం పారాయణ, వరుణ జపాలు చేశారు. తరువాత ఆలయానికి చేరువగా ఆలయ పోటుకు చెందిన కైంకర్యపరులు తయారు చేసిన పాయసాన్ని స్వామివారికి నివేదన జరిపి దాన్ని సమీపంలోని రాతిబండపై పోసారు. ఆ విధంగా రాతిపై వేసిన పాయసాన్ని ఆరగించాలని కోరుతూ దివిలోని వరుణునికి మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. వరుణుడి ప్రసన్నంతో వర్షాలు కురుస్తాయని స్థానిక రైతుల విశ్వాసం. రాతిపై వేసిన పాయసాన్ని ప్రసాదంగా ఆలయ సిబ్బంది, రైతులు, స్థానిక భక్తులు స్వీకరించడం పరిపాటి. ఈ సందర్భంగా ఉత్సవం విశేషాలను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, ఏఈఓలు ఎన్. ఆనందకుమార్, పి. శ్రీనివాసరావు, పర్యవేక్షణాధికారి రమణ, పీఆర్ఓ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీలో తాగునీటి కుళాయి



చెత్తతో నిండిన కాలువ

సింహగిరి గిరిజన గ్రామంలో అధ్వానంగా పారిశుధ్యం

సింహాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవళానికి కూతవేటు దూరంలో ఉన్న సింహగిరి గిరిజన గ్రామం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోంది. గిరిజనులకు మౌలిక వసతుల కల్పనలో అటు సింహాచలం దేవస్థానం కాని ఇటు జీవీఎంసీ కాని పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్థుల జీవనం దుర్భరంగా మారింది. ముఖ్యంగా వీధుల్లోని మురుగు కాలువల్లో పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోయి, పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో నెలలు తరబడి పూడికలు తొలగించకపోవడంతో విపరీతమైన దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి అధికంగా ఉంది. తాగునీటి కుళాయిల చుట్టూ మురుగు పేరుకుపోవడంతో కలుషిత నీటి వల్ల ఎప్పుడు ఏ వ్యాధి బారిన పడతామోనని గిరిజనులు భయపడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాగల చెరువు ఆక్రమణపై రైతుల ఆందోళన



చెరువు వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

భీమునిపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చేపలుప్పాడలో నాగల చెరువు ఆక్రమణలపై రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ సంస్థ నెల రోజులుగా చెరువును ఆనుకుని వున్న స్థలంలో చదును పనులు చేస్తూ చెరువు గట్టు కూడా తవ్వేస్తుందని, ఈవిషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా..పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ యజమాని చెరువు గట్టు తవ్వేయడమే కాకుండా, ఆ స్థలంలో కాంక్రీట్ పనులు కూడా చేపట్టారని చెప్పారు.గతంలో ఇదే సంస్థ తమ పంచాయతీలో పండావాని చెరువును కూడా ఇలానే ఆక్రమించి రహదారి నిర్మించారని, అప్పుడు కూడా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం నాగల చెరువు ఆరు ఎకరాల 90 సెంట్లుగా ఉంటే ప్రస్తుతం ఎకరా వరకూ ఆక్రమణకు గురైందన్నారు. తమ పంచాయతీలో అన్ని చెరువుల కంటే నాగల చెరువు విస్తీర్ణమే ఎక్కువని, ఈ చెరువు పైనే చాలామంది రైతులు సాగునీటికి ఆధారపడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించడంతో పాటు చెరువు విస్తీర్ణం సర్వే చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీపుళ్ళ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మైలపల్లి రాము, నాయకులు సూరాడ రవి, అమర్‌నాథ్, దౌలపల్లి రాజు, వాసుపల్లి కొండబాబు, చిన్న, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలో నవజాత మృత శిశువు

మధురవాడ, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి) : మానవత్వం మంటగలసింది. కన్నతల్లి పొత్తిళ్ళలో ఉండాల్సిన శిశువు చెత్త కుప్పలో కనిపించింది. అదీ విగతజీవిగా.. ఈ ఘటన ఐదో వార్డు పరిధిలోని మారికివలస రాజీవ్ గృహకల్పకాలనీ అన్నక్యాంటీన్ వెనుక ఉన్న చెత్త కుప్పలో కనిపించింది. ఆదివారం ఉదయం చెత్త కుప్ప వద్ద కుక్కలు గుమికూడడంతో స్థానికులు చూశారు. వాటిని తరిమివేయగా శిశువు మృతదేహం కనిపించింది. అప్పటికే శిశువు కదలికలు లేకపోవడంతో కాలనీవాసులు విషయాన్ని పీఎంపాలెం పోలీసులకు తెలిపారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేశారు. వివరాలు తెలియకపోవడంతో చివరకు పోలీసులే అంత్యక్రియలు జరిపించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆనందపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీలో ఉన్న హరేకృష్ణ వైకుంఠంలో ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. వైకుంఠంలోని రాధా మదన మోహన్ మందిరంలో కూచిపూడి నృత్య నిలయం డైరెక్టర్ కృష్ణవేణి ఈశ్వరి బృందం ఆధ్వర్యంలో కళాకారులు జ్యోతి మృదుల, మానస, మధురిమ నారాయణ, ప్రతిభ, ప్రయాగ, నిఖిత, సుమ, జైసాయి, శ్రావణి, లహరి, కృష్ణవేణి, రిషిక, లక్ష్మి, ఆక్షిత పలు కీర్తనలకు అద్భుతంగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా హరేకృష్ణ వైకుంఠం అధ్యక్షుడు అంబరీష దాస మాట్లాడుతూ భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రోత్సహించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జ్యోతిష్య శాస్త్రంపై జాతీయ సదస్సు

సాగర్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రలాజికల్ సైన్సెస్ (ఐసీఏఎస్) ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఐసీఏఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నవనీత కౌశిక్ హాజరై కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఐసీఏఎస్ కార్యదర్శి, విశాఖ శాఖ అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు ఆరోగ్యమే మహాభాగ్యం, ఆధ్యాత్మికత, సనాతన ధర్మం వంటి అంశాలపై ప్రసంగించారు. అనంతరం జొన్నలగడ్డ రాసిన వాస్తు చింతామణి గ్రంథాన్ని ఆవిష్కరించారు.

ఘనంగా సత్యసాయి సమితి వార్షికోత్సవం



భీమునిపట్నం,జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మోతీలాల్ వీధిలో వున్న సత్యసాయి సేవా సమితి 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున 4.45 గంటలకు సత్యసాయి మందిరంలో భక్తులు 21 సార్లు ఓంకార నాదాన్ని వినిపించారు. అనంతరం సుప్రభాతం, సాయి భజన బృందం నగర సంకీర్తన నిర్వహించారు. తరువాత పాలాభిషేకం, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. మధ్యాహ్నం సిద్ధాంతి శంకర్ సాయి శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, సాయంత్రం పల్లకీ సేవ జరిపారు. కార్యక్రమంలో నాయుడు, రాఘవరావు, ఆర్పీ నాయుడు, సాయికుమార్, సత్యసాయి కుమార్ పాల్గొన్నారు.



కూర్మావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇంద్రద్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు కూర్మావతారంలో భక్తులు ఆదివారం దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ అర్చకుడు రొంపిచెర్ల లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, తగరపువలస, మధురవాడ, బీచ్‌రోడ్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శివ, కేశవ ఆలయ సముదాయం ఎగ్జిక్యూటివ్ అథారిటీ రొంపిచెర్ల సింగరాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ, కూర్మావతార విశిష్టతను భక్తులకు వివరించారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

ఆనందపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలస జాతీయ రహదారి బ్రిడ్జి పక్కనున్న దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చింతా వాసు నాయుడు ఆదివారం తెలిపారు. పొడుగుపాలెం గ్రామానికి చెందిన యడ్ల సత్యన్నారాయణ (57) బెల్టు షాప్ నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు తొమ్మిది మద్యం బాటిళ్లు లభ్యం కావడంతో అతనిపై కేసును నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

వినియోగదారుల్లో చైతన్యం అవసరం

... 5వ పేజీ తరువాయి

మోసం జరిగినట్టు అనుమానమున్నా ఫిర్యాదు చేయవచ్చు. తూనికలు శాఖ అధికారులు ముద్రణతో ఇచ్చిన పరికరాలు వినియోగించకపోయినా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో టోల్‌ఫ్రీ నంబరు 1967 ఉంది. జిల్లాస్థాయిలో 0891 2799551 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కొన్ని గంటల్లోనే చర్యలు తీసుకుని అప్‌డేట్ సమాచారాన్ని అందిస్తాం. ప్రతి ఫిర్యాదుపైనా చర్యలుంటాయి. ఫిర్యాదు చేసే వ్యక్తి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి. ఎవరూ ప్రశ్నించకపోతే మోసాలు పెరుగుతాయి. ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకుంటే మిగిలిన వారికి భయం వస్తుంది.

ప్యాకేజీ నిబంధనలపై వినియోగదారులకు అవగాహన ఉండాలి. ప్రతి ప్యాకింగ్ వస్తువుపై తప్పనిసరిగా కొన్ని వివరాలు ఉండాలి. అవి లేకపోయినా, తప్పుడు సమాచారం ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు. వస్తువు తయారుచేసిన సంస్థ, ప్యాకెట్‌లో ఉన్న ఐటెమ్, బరువు, గడువు, ధర వంటి వివరాలు ఉండాలి. ఇందులో ఏ సమాచారం లేకపోయినా, అదనపు ధర వసూలు చేసినా శిక్షార్హులు. కొత్తగా యూనిట్ సేల్ ధరను కూడా మెన్షన్ చేయాలన్న నిబంధన వచ్చింది. అంటే ఒక గ్రాము ధర ఎంత పడుతుందన్న సమాచారం తప్పనిసరిగా ముద్రించాలి.

గత ఏడాది ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,519 మంది కేసులు నమోదు చేశాం. ఇందులో తూనికలకు సంబంధించిన మోసాలు 1422 ఉన్నాయి.ప్యాకేజీ నిబంధనలు అమలు చేయని వారిపై 1097 కేసులున్నాయి. వాటి ద్వారా రాజీకి వసూలుచేసిన మొత్తం రూ.1.64.67,700. ముద్రణ ఫీజు కింద రూ.3,23,72,700 వసూలు చేశాం.

శాఖ పరిధిలో తగిన సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం డిప్యూటీ కంట్రోలర్, విశాఖ జిల్లాలో నలుగురు అసిస్టెంట్ కంట్రోలర్స్ ఉన్నారు. వీరిలో ఇద్దరు పూర్తిగా హెచ్‌పీసీఎల్, ఐఓసీ, బీపీసీ కంపెనీల్లోని ట్యాంకులను పరిశీలిస్తారు. మిగిలిన ఇద్దరూ నగర పరిధిలో సేవలందిస్తారు. మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లున్నారు. అనకాపల్లి జిల్లాకు ఒక అసిస్టెంట్ కంట్రోలర్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరిలో నర్సీపట్నం కేంద్రంగా పనిచేసే ఒక ఇన్‌స్పెక్టర్ అల్లూరి జిల్లా బాధ్యతలను చూస్తారు. అల్లూరి జిల్లాకు ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఉన్నారు.

పెట్రోలు బంకుల్లో మోసాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఇక్కడ మోసాలు డిఫరెంట్‌గా ఉంటాయి. పెట్రోల్ పోయించుకునే ముందు జీరో ఉన్నదీ? లేనిదీ చూడాలి. ఆశించిన స్థాయిలో ఫిల్ చేయలేదనిపిస్తే అక్కడే ఉన్న ఐదు లీటర్ల ట్యాంకులో ఫిల్ చేయమని కోరాలి. ప్రతి పెట్రోల్ బంకులో ఈ తరహా ట్యాంకు ఉండాలి. ట్యాంకు లేదన్నా, పెట్రోలు అందులో పోయను అన్నా ఫిర్యాదు చేయవచ్చు. వారిపై చర్యలు తీసుకుంటాం.

కౌన్సెలింగ్‌లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

అభ్యంతరం తెలిపారు. కార్యదర్శుల సీనియారిటీ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి, అభ్యర్థులు కోరుకున్న సచివాలయంలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనివల్ల కౌన్సెలింగ్‌లో అక్రమాలకు తావుండదని, మూడు ఆప్షన్లు ఇస్తే ఎవరికి ఎక్కడ వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంటుందన్నారు. అయితే అధికారులు మాత్రం మూడు ఆప్షన్లు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేయడంతో కౌన్సెలింగ్‌కు హాజరైనవారంతా అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కౌన్సెలింగ్ హాల్ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం కమిషనర్ చాంబర్ ఎదురుగా ఉన్న పోర్టికో వద్ద నిరసన తెలిపారు. చివరకు కొందరు కార్యదర్శులు మూడు ఆప్షన్లతో విల్లింగ్ లెటర్‌లను అందజేయడం విశేషం.

336 మంది సర్వేయర్లు, 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ

ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఆదివారం సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో విశాఖ, అనకాపల్లి సర్వేశాఖ ఏడీలు సూర్యారావు,గోపాలరాజా ఆధ్వర్యంలో 336 మంది సర్వేయర్లకు బదిలీ చేశారు. మూడు జిల్లాల పరిధిలో బదిలీల ప్రక్రియ చేపట్టడంతో సచివాలయం ఎంపికకు ప్రతి ఉద్యోగికి ఐదు నుంచి పదిమిషాలు పడుతోంది. దీంతో రాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగించారు.

జిల్లా పరిషత్ సమావేశమందిరంలో 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ ప్రక్రియ ఉదయమే నిర్వహిస్తామని ప్రకటించడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వచ్చారు. మెరిట్ జాబితా ప్రకటించడానికి ఆలస్యమైంది. దీంతో సాయంత్రం కౌన్సెలింగ్ ప్రారంభించారు. బదిలీల్లో కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పలువురికి సిఫారసు లేఖలు ఇచ్చారు. కొందరు ఎమ్మెల్యేలు ఫోన్‌లు చేసి ఒత్తిడి తెచ్చారు. దీంతో బదిలీలపై కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అనుమానం వ్యక్తంచేశారు.

ఆటోనగర్‌పైనా వైసీపీ అక్కసు!

... 5వ పేజీ తరువాయి

జిల్లా యంత్రాంగం సూచన మేరకు రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ పరిహారం కోసం సీఎఫ్ఎంఎస్ నుంచి డ్రాచేయడానికి బిల్లు (నంబరు-169977) అప్‌లోడ్ చేశారు. అయితే పరిహారానికి సంబంధించిన ఖాతాలో సొమ్ములు ఇతర అవసరాలకు మళ్లించడంతో బిల్లు పెండింగ్‌లో పడిపోయింది. ఇదే సమయంలో ఆటోనగర్ అసోసియేషన్ ఏపీఐఐసీ అధికారులను కలిసి పరిహారం పంపిణీ, ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే రైతులకు ఇవ్వాల్సిన రూ.32.64 కోట్లు కలెక్టర్ ఖాతాలో డిపాజిట్ చేశామని నివేదిస్తూ అసోసియేషన్‌కు ఏపీఐఐసీ జోనల్ మేనేజరు లేఖ పంపారు. అర్హత గల రైతులకు పరిహారం పంపిణీ కోసం రెవెన్యూ అధికారులు పెట్టిన బిల్లు సీఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్‌లో ఉందని వివరించారు. రైతులకు పరిహారం చెల్లించిన తరువాత భూమి స్వాధీనం చేసుకుని ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అయితే రైతులకు చెల్లించిన పరిహారంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని గ్రామ సర్పంచ్ ఆబోతు అప్పలరాము ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సర్వే నంబరు 50లో 157 ఎకరాలను రైతుల నుంచి సేకరించారని, వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు, రెవెన్యూ అధికారులు జాబితా నుంచి అర్హుల పేర్లు తొలగించి వైసీపీ సానుభూతిపరులను చేర్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్హులకు అందాల్సిన సుమారు 14 కోట్ల పరిహారం స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్

... 5వ పేజీ తరువాయి

కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈఏపీసెట్ ర్యాంకర్లకు మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సులో చేరే విద్యార్థులకు రూ.79 వేలు ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్ ఈసీఈ వంటి బ్రాంచ్‌ల మాదిరిగా ప్రత్యేక బ్రాంచ్‌గా ఈ కోర్సును నిర్వహించనున్నారు.

అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు నిర్వహణకు అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం. ఇందుకోసం కొన్ని ప్రైవేటు సంస్థల ల్యాబ్ సేవలను వర్చువల్ విధానంలో వినియోగించు కోవాలని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లు అమెజాన్, మైండ్ ట్రీ, గూగుల్ వంటి సంస్థలకున్నాయి. వాటిని వర్చువల్ విధానంలో బోధనకు వినియోగించుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహణ..

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును దేశంలోని కొన్ని విద్యా సంస్థలు ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయంటున్నారు. భవిష్యత్తు టెక్నాలజీ, ఆవిష్కరణలు దీనిచుట్టే తిరుగుతున్న నేపథ్యంలో కోర్సు నిర్వహణ వర్సిటీకి జాతీయస్థాయిలో గుర్తింపును తీసుకువస్తుందని ఏయూ అధికారులు చెబుతున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఖ్యాతితేజ (33) మృతి చెందినట్టు నిర్ధారించారు. కౌశిల్‌కి ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఖ్యాతితేజ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నట్టు సమాచారం. కౌశల్ సీలింగ్ వర్క్ చేస్తుంటాడు. ఇతనికి కూడా వివాహమైంది. మాడుగుల ఎస్ఐ నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు.

రాయిపాలెంలో డిఫెన్స్ మద్యం స్వాధీనం

తగరపువలస, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 2వ వార్డు రాయిపాలెంలో ఎక్సైజ్ పోలీసులు ఆదివారం 21 డిఫెన్సు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా రాయిపాలెంలో మద్యం అమ్ముతున్న విషయాన్ని గమనించారు. ఈమేరకు పి. కృష్ణవేణిని అరెస్టు చేసి, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. అలబోని రమణ (46) భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న రమణ రాత్రి సమయంలో బస్టాపుల్లో నిద్రపోతుంటాడు. ఇసుకతోట లాన్సమ్ టవర్స్ బిల్డింగ్ వద్ద తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో రోడ్డు పక్కన నిద్రపోతుండగా, లారీ ఒకటి వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో రమణ అక్కడికక్కడే మృతి చెందాడు.అతడి సోదరుడు అలబోని అప్పలరాజు ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైసెన్సు లేని వాహనచోదకుడిపై కేసు

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ప్రమాదకరంగా నడిపిన లైసెన్సు లేని ఓ యువకుడిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ గోవిందరావు తెలిపిన వివరాల మేరకు.. ఎంవీపీ ట్రాఫిక్ ఎస్‌ఐ కనకారావు సిబ్బందితో కలిసి శనివారం మద్దిలపాలెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై ఇసుకతోటకు చెందిన దుండి ఉదయ్ బాబు వాహనాన్ని ప్రమాదకరంగా నడుపుతున్నట్లు గమనించి, అడ్డుకున్నారు. అతడికి లైసెన్స్ కూడా లేకపోవడంతో ఎస్‌ఐ కనకారావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిపై కేసు మోదు చేశారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వెంకోజీపాలెం హనుమాన్ విగ్రహం సమీపంలో వేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో బైకుపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెదవాల్తేరుకు చెందిన శోభ సీతరాజు, తన ఇంట్లో పనిచేస్తున్న కొర్ర లక్ష్మిని శనివారం ఆసుపత్రికి తీసుకువెళుతుండగా ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని మెడికవర్‌కు తరలించారు. ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ఆరిలోవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షనులోని ఓ లాడ్జిలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కాకినాడకు చెందిన కుక్కల లోకనాథ్ (34) ఎంవీపీలోని సాంఘిక సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. భార్యతో కలిసి నగరంలో ఉంటున్నాడు. భార్య బుచ్చయ్యపేట మండలంలో ప్రభుత్వ ఉద్యోగిని. ఇటీవల జరుగుతున్న బదిలీల విషయమై నలుగురు సహోద్యోగులతో కలిసి హనుమంతవాక జంక్షను సమీపంలోని ఓ లాడ్జిలో దిగారు. ఆదివారం ఉదయం గుండెలో నొప్పిగా ఉందని చెప్పి లోక్‌నాథ్ దగ్గరలో మెడికల్ షాపునకు వెళ్లాడు. ఈనో ప్యాకెట్ తీసుకొని నీటిలో కలిపి తాగి పడుకున్నాడు. నిద్ర నుంచి లేవకపోవడంతో వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారని ఆరిలోవ ఎస్‌ఐ రామదాసు తెలిపారు.

సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు)26,వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100,కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 86, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180


టూనా చేపలు


ప్యాకింగ్ చేస్తున్న మత్స్యకారులు


వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

టూనా చేపలపై మత్స్యకారుల గురి

బీచ్ రోడ్డు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విదేశీ మార్కెట్‌లో డిమాండ్ ఉండడం, అధిక రాబడి రావడంతో టూనా చేపల వేటపై బోటు ఆపరేటర్లు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్, చేపల రేవులో నిరుటితో పోలిస్తే ఈ సారి 50 బోట్లు అధికంగా ట్యూనా చేపలకు బయల్దేరి వెళ్లాయి. ఇక్కడ రేవులో 680 వరకు బోట్లు ఉంటే దాదాపు 200 వరకు టూనా చేపల వేట సాగిస్తున్నాయి. ఆ చేపలు బరువుగా ఉండడంతో సముద్రంలో లోతైన ప్రదేశాలలో మాత్రమే లభ్యమవుతాయి.వేటకు వెళ్లే బోట్లు కనీసం 20 నుంచి 25 రోజులు సముద్ర జలాల్లోనే ఉంటాయి. ఫిషింగ్ హార్బర్ నుంచి బయల్దేరి పశ్చిమబెంగాల్ సరిహద్దు వరకు వెళ్లి వేట సాగిస్తూ ఉంటారు. సాధారణ బోట్ల వలలతో టూనా చేపల వేట అసాధ్యం. వాటి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వలలు, గ్యాలం తాళ్లు, చిక్కిన చేపలను శుభ్రపరిచేందుకు, భద్రపరిచేందుకు బోట్లను సిద్ధం చేసుకోవాలి. ఈ తరహా వేట సాగించే మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తుండడంతో చాలామంది అటువైపు దృష్టి సారిస్తున్నారు.

ప్రభుత్వ రాయితీపై వెసులుబాటు

ఒక బోటు 20 రోజులు వేట సాగిస్తే 6 నుంచి 7 టన్నుల వరకు చేపల దిగుబడి వస్తుంది. కిలో ధర రూ.160 వరకు ఉంటుందని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేస్తే ధర పెరిగే అవకాశాలు ఉన్నాయని జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు.

లాంగ్ లైన్ వలల వినియోగం

తీరం నుంచి 60 కి.మీ.ల వరకు వెళ్లి వేట సాగిస్తున్నారు. 800 నుంచి 1000 గ్యాలాలు అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్న బోట్లను డీప్ సీ ఫిషింగ్‌కు అనుకూలంగా మార్చుకునేందుకు అయ్యే ఖర్చులో 40శాతం వరకు రాయితీ లభిస్తుంది.

ప్రత్యేక దృష్టి సారించాలి

ట్యూనా చేపలు పట్టుబడిన వెంటనే మెదడు, పేగులు, రెక్కలు, ముక్కులు తొలగిస్తారు. ఆ తరువాత బోట్లలో ఐస్‌తో నిండిన ప్రత్యేక గదిలో 0 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేస్తారు. అలా చేప నాణ్యతను పరిశీలిస్తే అధిక ధర లభిస్తుంది.

విదేశాలకు ఎగుమతి

శుద్ధి చేసిన టూనా చేపలు అమెరికా, థాయిలాండ్ ఇతర యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశంలో కేరళకు పంపుతుంటారు. ఈ చేపల్లో ముళ్లు తక్కువగా ఉంటాయని, అధిక శాతం ప్రొటీన్లు ఒమేగా 3, ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు అధికంగా ఉండడంతో డిమాండ్ పెరుగుతుందని జాయింట్ డైరెక్టర్ వివరించారు.


రామలక్ష్మి అపార్ట్‌మెంట్ సమీపంలో ఆక్రమణకు గురైన గెడ్డ


పెదవాల్తేరు ఎంజీఆర్ ఆసుపత్రి సమీపంలో గెడ్డ

పెదవాల్తేరులో గెడ్డలు ఆక్రమణ

పెదవాల్తేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరు ప్రాంతం గుండా పారుతున్న గెడ్డలు ఎక్కడికక్కడ ఆక్రమణల చెరలో చిక్కాయి. దీంతో జీవీఎంసీ సుమారు రూ.50 లక్షలతో ఆధునికీకరించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో కొన్నిచోట్ల పూడుకుపోయాయి. వర్షం కురిసినప్పుడు వరద నీరు ప్రవహించే దారిలేక పలు పల్లపు ప్రాంతాలను నీరు ముంచెత్తుతోంది. ఈ గెడ్డ ఏయూ నుంచి పోలమాంబ ఆలయం, నౌకనగర్, నౌకనగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, ఎంజీఆర్ ఆసుపత్రి, రామలక్ష్మి ఆపార్ట్‌మెంట్ పక్కన అన్నపూర్ణ కాంప్లెక్స్, పెదవాల్తేరు ఇందిరానగర్, ఉషోదయ నంది గుడిమీదుగా లాసన్స్ బే కాలనీ గెడ్డలో కలిసి వాసువానిపాలెం మీదుగా లాసన్స్ బే పార్కు గెడ్డ నుంచి సముద్రంలో కలుస్తాయి. ప్రస్తుతం ఈ గెడ్డలు కొన్ని ప్రాంతాల్లో 20 అడుగులు ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో రెండు అడుగులకే పరిమితమయ్యాయని, పలు ప్రాంతాల్లో స్థానికులు వాపోతున్నారు. ఈ గెడ్డ పక్కన నిర్మాణాలు చేపట్టినవారు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. వర్షం పడినప్పుడు నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు ఉండటంతో పాటు వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు పొంగి రహదారులపైకి చేరుతోంది. ఓ అపార్టుమెంటు వద్ద గెడ్డ ఆక్రమణకు గురవడంతో ఇటీవల వర్షాలకు పెదవాల్తేరులోకి వరదనీరు చేరిందని స్థానికులు వాపోయారు. దీంతో ఇటీవల జీవీఎంసీ అధికారులు సర్వే నిర్వహించి గెడ్డలు ఆక్రమణకు గురికాకుండా రక్షణగోడలు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం సుమారు రూ.50 లక్షలు కేటాయించారు. కొన్ని ప్రాంతాల్లో గెడ్డను ఆక్రమించి భవనాలకు ప్రహరీలు నిర్మించారు. దీంతో 20 అడుగుల గెడ్డ కాలువలా చిక్కిపోయింది.

రద్దు చేసిన పట్టా పునరుద్ధరణకు ప్రయత్నాలు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలంలోని రామవరంలో ఎంఐజీ టౌన్‌షిప్ కోసం భూములు సమీకరిస్తున్నారు. టౌన్‌షిప్ కోసం సేకరించిన భూములకు ఆనుకుని ఉన్న వాటికి గిరాకీ ఏర్పడింది. దీనిలో భాగంగా సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు సంబంధించి రద్దుచేసిన డీపట్టా పునరుద్ధరణకు కూటమి పార్టీకి చెందిన కొందరు నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. గ్రామానికి చెందిన ఒకరికి గతంలో అప్పటి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారు. ఈ భూమిని నగరానికి చెందిన ఒకరికి 99 ఏళ్ల లీజుకు ఇవ్వడంతో అధికారులు విచారణ చేసి 2021లో డీపట్టాను రద్దు చేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ తరువాత 2023 డిసెంబరులో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు మంజూరుకు అప్పట్లో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో 2021లో సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు రద్దు చేసిన డీపట్టాకు ఫ్రీహోల్డ్ జారీ చేయడం గత ఏడాది వెలుగులోకి రావడంతో అధికారులు స్పందించి ఫ్రీహోల్డ్‌ను రద్దు చేశారు. తాజాగా గ్రామంలో కూటమి నాయకులు కొందరు ఈ భూమికి చెందిన పట్టాను పునరుద్ధరించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది సాయం తీసుకున్నారని గ్రామానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

మాజీ ఎంపీ ఎంవీవీపై చర్యలు తీసుకోవాలని వినతి

కూర్మన్నపాలెం,జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86,87 వార్డులకు సంబంధించిన శ్మశానవాటిక స్థలం కబ్జా చేసిన ఎంవీవీ ఎంకే పార్కుకు చెందిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం విజయవాడలో మునిసిపల్ శాఖా మంత్రి డా. పొంగునూరు నారాయణకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆదివారం వినతి పత్రం అందజేశారు.సర్వే నెంబర్ 60/5లో 30 అడు గుల వెడల్పు, 600 మీటర్ల పొడవు గల శ్మశాన వాటిక ప్రహరీ గోడ, సర్వే నంబర్ 55లో సుమారు 1268 గజాలలో రహదారి, సర్వే నంబరు 58/3లో 1626 గజాల బఫర్ జోన్, టీడీఆర్ కింద 2148 గజాల స్థలంలో ఆక్రమణలుచోటు చేసుకున్నాయన్నారు. ఈ విషయమై కౌన్సిల్‌లో కూడా చర్చించినా ఎవరూ స్పందించ లేదని ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి ఆక్రమిత స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి నారాయణకు వినతి పత్రమిస్తున్న బొండా జగన్

'సౌకర్యం' ఉద్యోగి నుంచి సొమ్ము రికవరీ?

వేపగుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రంలో అవకతవకలకు పాల్పడిన సొమ్మును అధికారులు ఎట్టకేలకు రికవరీ చేసినట్టు సమాచారం. ఈ కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగి బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును పూర్తిస్థాయిలో చెల్లించకుండా అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఆడిట్ విభాగంలో విచారణ చేపట్టారు.సౌకర్యం కేంద్రం ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులను పిలిపించి వివరాలు సేకరించారు. దీంతో పొరపాట్లను గుర్తించి బ్యాంకుకు చెల్లించాల్సిన రూ. 50 లక్షల వరకు సొమ్మును సంబంధిత ఉద్యోగి నుంచి వసూలు చేసినట్లు తెలిసింది.పూర్తిస్థాయి విచారణ అనంతరం సంబంధిత ఉద్యోగితో పాటు ఇందులో అలసత్వం చేసిన ఇతర ఉద్యోగులపై చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

రైలు నుంచి జారిపడి ఇద్దరికి గాయాలు

గోపాలపట్నం,జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఇద్దరి యువకులు గాయపడిన ఘటన సింహాచలం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలివి.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన పవిత్రాదాస్, సంగ్రామం దాస్ భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో రైలు సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ సమయంలో రైలు బోగి ఫుట్‌బోర్డ్ వద్ద కూర్చుని ఉన్న ఈ ఇద్దరు యువకులు ప్లాట్‌ఫారంపైన జారిపడ్డారు. వారికి గాయాలు కావడంతో వెంటనే సమీపంలో ఉన్న ఆర్పీఎఫ్ ఎస్‌ఐ సూరజ్‌కుమార్, హెచ్‌సీ డి.జగదీశ్ 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి'

ఎన్‌డీపీ జంక్షన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని చూరగొనే బాధ్యత ప్రభుత్వానిదేనని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు అన్నారు. స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బేసిక్ ప్రాథమిక పాఠశాలు 19 వేలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల పనివేళల్లో బోధనేతర పనులు, శిక్షణ తరగతులు లేకుండా చూడాలని సూచించారు. జిల్లా ప్రధానకార్యదర్శి టీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ను జూలై 5వరకు కొనసాగించాలన్నారు.

మద్దిలపాలెంలో వెలగని లైట్లు


చీకటిగా ఉన్న మద్దిలపాలెం రోడ్డు

మద్దిలపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23 వ వార్డు మద్దిలపాలెంలో చీకట్లు అలుముకున్నాయి. రాజేశ్వరి ఆలయం నుంచి మద్దిలపాలెం వచ్చే రహదారిలో వీధిదీపాలు మరమ్మతుకు గురవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రాజేశ్వరి ఆలయం రోడ్డు, చైతన్యనగర్ ప్రాంతాల్లో చాలా చోట్ల విద్యుత్ లైట్లు ఎప్పటి నుంచో రిపేర్లకు గురైనప్పటికీ కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. దీంతో చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణం చేస్తున్నారు. మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రహరీ వద్ద మందు బాబులు నిత్యం హల్‌చల్ చేస్తుంటారు. లైట్లు లేకపోవడంతో చీకట్లో రాకపోకలు సాగించే మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన విద్యుత్ దీపాలు అమర్చాలని కోరుతున్నారు.


కొనుగోలుదారులతో కళకళలాడుతున్న ఫిషింగ్ హార్బర్

చేపను పట్టేశా..వలను చుట్టేశా...!

- ఫిషింగ్ హార్బర్‌లో సందడి

బీచ్ రోడ్డు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం మత్స్యకారుల వలలకు పుష్కలంగా వివిధ రకాల చేపలు లభ్యమయ్యాయి. కవ్వళ్లు, పారలు, కానాకదళ్లు, రొయ్యలు తదితర రకాల చేపలు అధిక సంఖ్యలో చిక్కాయి. వేల రూపాయలు విలువ చేసే ఈ మత్స్య రాశుల కొనుగోలుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుండడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్‌కే బీచ్‌లో సందర్శకుల తాకిడి

బీచ్‌రోడ్డు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం సెలవు దినం కావడంతో ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు నగరానికి చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఆర్కే బీచ్ కిటకిటలాడింది. ఉదయం నుంచి ఎటు చూసినా సందడే.తీర ప్రాంతాల్లో సాయంత్రం వరకు పిల్లా పాపలతో ఉల్లాసంగా గడిపారు. విహారయాత్రలో భాగంగా పర్యాటకులు సముద్ర స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పోలీసులు ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సముద్రంలో స్నానాలు చేయకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

లాసన్స్ బే రోడ్డులో కంపు...కంపు!


లాసన్స్ బే కాలనీలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు

పెదవాల్తేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 19వ వార్డు లాసన్స్ బే కాలనీలో హనీ గ్రూప్ సమీపంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని, రోడ్డు నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. ఇక్కడ మలమూత్ర విసర్జన చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గంలో బాటసారులు ముక్కు మూసుకుని ముందుకు సాగాల్సిందే. ఇక్కడ నివాసితులలో చాలామంది వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాసన్స్ బే కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో శ్రీఅసంగానంద ఆశ్రమం వద్ద రోడ్డుపై వ్యర్థాలు వేయడంతో చెత్త కుప్పలను తలపిస్తోంది. వర్షాలకు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

'టీసీకి డబ్బులు అడుగుతున్నారు'

ఆరిలోవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్రకారాగారానికి సమీపంలోని అంబేడ్కర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థులకు కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులయ్యాక పైచదువుల నిమిత్తం బదిలీ సర్టిఫికెట్ (టీసీ) అడిగితే ఇవ్వడానికి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కనీసం రూ.700 చెల్లిస్తే టీసీ ఇస్తామంటున్నారని, ఎందుకు ఇవ్వాలని నిలదీయగా స్కూలులో ఫ్యాన్లు పాడుచేశారంటూ అభియోగం మోపుతున్నారని పేర్కొన్నారు. గతంలో కూడా స్కూలుకు ఆలస్యంగా వస్తే రూ.300 అపరాధ రుసుము విధించి, ఆ డబ్బుతో ఫినాయిల్ తీసుకు రావాలని ఆదేశించేవారని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌ల తీరును విమర్శించారు. విద్యార్థి తండ్రి బుల్లిబాబు మాట్లాడుతూ తన కుమారుడికి పాలీసెట్‌లో ర్యాంకు వచ్చిందని, పాడేరులో ఉంటున్న తమకు ఐదు రోజులుగా టీసీ ఇవ్వడానికి తిప్పుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇన్‌చార్జి సమన్వయకర్త రామకృష్ణను ప్రశ్నించగా విద్యార్థుల టీసీలకు డబ్బులు వసూలు చేయడం నేరమన్నారు. వెంటనే టీసీలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఇగ్నో కోర్సులపై అవగాహన

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం పరిధిలోని మూడు పరీక్షా కేంద్రాల్లోని విద్యార్థులకు ఇగ్నో కోర్సులపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయా కేంద్రాలను పరిశీలించిన ఇగ్నో ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు కోర్సులను వివరించారు. గాజువాక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఇగ్నో పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు.

జూకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుమారు 3,600 మంది సందర్శించారని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.3.13 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆమె తెలిపారు.

తూర్పు నౌకాదళంలో చేరిన 25 టీ బొల్లార్డ్ పుల్ టగ్

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నౌకాదళంలో 25టీ బొల్లార్డ్ పుల్ టగ్ ఆదివారం చేరింది. నేవల్ డాక్ యార్డ్ జీఎం చేతన్‌కుమార్‌సింగ్ సమక్షంలో ఈ టగ్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు టగ్‌ల నిర్మాణాలకు సంబంధించిన ఒప్పందంలో భాగంగా ఐదో టగ్‌ను టీఆర్ఎస్ఎల్ సంస్థ అందించింది. ఈ టగ్‌ను ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ (ఐఆర్ఎస్)కు అనుగుణంగా నిర్మించారు. దీనిని పరిమిత జలాల్లో నేవీ షిప్‌లు, జలాంతర్గాములకు సహాయం అందించేందుకు, రెస్క్యూ ఆపరేషన్స్ సమయంలో వినియోగిస్తుంటారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా భారత్ ప్రభుత్వం వీటిని నిర్మిస్తోంది.

అర్చకుడి స్మార్ట్ ఫోన్ తిరుపతిలో లభ్యం

- పోలీసుల అదుపులో నలుగురు ?

భీమునిపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయం అర్చకుడు ఏడిద గణేశ్ సుబ్రహ్మణ్య శర్మ ఏప్రిల్ 24న తిరుపతిలో అదృశ్యమైన విషయం తెలిసిందే. పోలీసులు నాలుగు రోజుల క్రితం తిరుపతి వెళ్లి కేసు దర్యాప్తు చేపట్టారు. అర్చకుడు వినియోగించిన స్మార్ట్ ఫోన్‌ను ఎవరికో అమ్మివేసినట్టు గుర్తించారు. ఫోన్‌ను ట్రాకింగ్‌లో పెట్టి వినియోగిస్తున్న వ్యక్తులను పట్టుకోగా, ఈ ఫోన్ మొత్తం నలుగురు చేతులు మారిందని తెలిసింది. మొదట వ్యక్తికి అర్చకుడు కేవలం రూ.700లకే ఫోన్ అమ్మేసాడని సమాచారం. ఆ తర్వాత రెండో వ్యక్తి ఆ ఫోన్‌ను రూ. 3 వేలుకు, మూడో వ్యక్తి రూ. 5 వేలుకు, నాలుగో వ్యక్తి రూ.7 వేలుకు కొనుగోలు చేసినట్టు తెలిసింది. నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని తిరుపతిలోనే విచారించారు. కాగా సిసి పుటేజీల్లో మాత్రం ఎక్కడా అర్చకుడు కనిపించకపోవడం గమనార్హం.

భీమిలి తీరానికి డాల్ఫిన్ కళేబరం



భీమునిపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : భీమునిపట్నం సముద్ర తీరానికి ఆదివారం సాయంత్రం భారీ డాల్ఫిన్ కళేబరం కొట్టుకు వచ్చింది. అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈనేపథ్యంలో భారీ డాల్ఫిన్ సముద్రంలోనే మృత్యువాతపడి, తీరానికి కొట్టుకువచ్చింది. పది అడుగుల పొడవు, మూడున్నర అడుగుల వెడల్పుతో సుమారు 700 కిలోల బరువు ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. డాల్ఫిన్‌లు చాలా అరుదుగా తీరానికి కొట్టుకువస్తాయని వారు తెలిపారు.

ఘనంగా వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు



అల్లిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అల్లిపురంలోని వివేకానందవీధిలో ఉన్న సాయిశ్రీ మేరు ట్రస్ట్ సాయి దర్బార్ ప్రాంగణంలో వారాహి అమ్మవారి నవరాత్రి పూజా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి అష్టోత్తరాలు, విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొన్నారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విశేషపూజలు జరుగుతాయని, అనంతరం అమ్మవారికి హారతులిస్తామని ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ ప్రసన్న, పి.శ్రీనివాస సుబ్రమణ్యశాస్త్రి, స్వప్నప్రియ, పద్మజ, పద్మావతి, గ్రంధి రమా, రూపాదేవి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

వృద్ధుల ఇళ్ల వద్దకే రేషన్



సరుకులు అందజేస్తున్న కార్పొరేటర్ నాగరాజు

అల్లిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేశామని జనసేన 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. ఐదు రోజులు ముందుగానే వారి ఇంటికి వెళ్లి సరుకులు అందజేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా డీలర్ల ద్వారా నేరుగా అందించామన్నారు. గతంలో రేషన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. 30లోగా అందరికీ సరకుల పంపిణీ పూర్తవుతుందన్నారు.

ఎన్‌సీసీలో చేరికకు పరీక్షలు

సీతమ్మధార, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఆదివారం భౌతిక పరీక్షలు నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు దేహదారుఢ్యం, పరుగు పందెం, వివిధ పోటీలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. 15 పాఠశాలల నుంచి 565 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోగా అందులో 370 మంది పరీక్షలో నెగ్గి ఎన్‌సీసీలో చేరికకు అర్హత సాధించారు.

నేడు రైల్వే పెన్షనర్ల మానవహారం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ సవరణ బిల్లును నిరసిస్తూ నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్ల అసోసియేషన్ న్యూఢిల్లీ పిలుపు మేరకు రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్, రిటైర్డ్ కోచ్‌వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా సోమవారం డీఆర్ఎం కార్యాలయం సమీపంలో మానవహారం నిర్వహించనున్నట్టు సంఘాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 10.30 గంటలకు మానవహారంగా ఏర్పడి, డిమాండ్లపై డీఆర్ఎం లలిత్ బొహ్రాకు వినతి పత్రం అందిస్తామని పేర్కొన్నారు.

'సామాన్యుల ప్రయోజనాలే లక్ష్యంగా విధానాలు ఉండాలి'



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు సి.రామచందయ్య

డాబాగార్డెన్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల ప్రయోజనాలు కేంద్ర బిందువుగా విధానాలు ఉండాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'విశాఖపట్నం అభివృద్ధి-నిధులు-సంస్కరణలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ సరిగ్గా నిలబడగలిగే పునాది లేకపోయినా గాల్లోకి ఎగురుదామనే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. నగరాల్లో ఫ్లైఓవర్లు, మెట్రో రైళ్లు ఎన్ని వచ్చినా రద్దీ తగ్గదని హైదరాబాద్ అనుభవాలు తెలుపుతున్నాయన్నారు. సింగపూర్ నమూనా గురించి పదేపదే వల్లించే నేతలు అక్కడ మాదిరిగా రవాణా, మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖపట్నం రాష్ట్ర విభజన తరువాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పట్టణ పౌర సమైక్య కన్వీనర్ సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ పౌరసేవలన్నింటిని ప్రైవేటుపరం చేసి చార్జీలు వసూలు చేస్తున్నాయన్నారు. ఫ్లోర్ లీడర్ ఏజె స్టాలిన్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కౌన్సిల్‌కున్న ప్రాధాన్యత ఇప్పుడు లేదన్నారు. సదస్సులో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వార్వా అధ్యక్షుడు ఎన్.ప్రకాశరావు, నివాస్ కార్యదర్శి పిట్ట నారాయణమూర్తి, ఎం.బసవపున్నయ్య, పి.మధు తదితరులు మాట్లాడారు. ముందుగా విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.పద్మ ఆహ్వానం పలకగా, ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు.

'బీసీలకు చట్టసభలో ప్రాధాన్యత అవసరం'



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

సీతంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీసీల్లో ఇప్పటివరకు అవకాశం పొందని కులాలకు చట్టసభల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయంలో పార్టీలకు అతీతంగా ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బీసీ సంఘం నాయకులు రేవు రత్నకుమారి, పావులూరి హనుమంతరావు, నాగిడి సాంబశివరావులు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప చట్టసభల్లో మాత్రం ప్రాధాన్యత కల్పించటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక శాతం ఉన్న బీసీలను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, అందరూ ఏకమై తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికార పార్టీ బీసీలకు ప్రాధాన్యత కల్పించి చట్టసభలో స్థానం కల్పించాలని కోరారు. లేకుంటే తమ హక్కుల సాధనకు పోరాటాలు చేస్తామని అన్ని పార్టీలను హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పిన్నింటి ఆదిమూర్తి యాదవ్, బీసీ రమణ, వాసుపల్లి జానకిరామ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఆర్చ్‌బిషప్‌కు అరుదైన గౌరవం



ఉడుముల బాలను అభినందిస్తున్న దృశ్యం

మహారాణిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్ బసిలికాలో దివ్యబలి పూజ సందర్భంగా ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా 54 మంది ఆర్చిబిషప్‌లకు పాల్లియం అందించారు. భారతదేశం నుంచి ముగ్గురు అగ్రపీఠాధిపతులకు మాత్రమే ఈ గౌరవం దక్కగా, అందులో విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాల ఒకరు. పాల్లియం అనేది తెల్లని గొర్రె ఉన్నితో తయారు చేసిన వైవార్చన వస్త్రం. దీన్ని మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్ అధికారిక గుర్తుగా పరిగణిస్తారు. ఇది స్థానిక అగ్రపీఠ పరిధిలోని ఇతర మేత్రాసనాలకు పోప్‌తో ఉండే సమైక్యతను ప్రతిబింబిస్తుంది. విశాఖ అగ్రపీఠాధిపతిగా ఉన్న ఉడుముల బాల ఈ గౌరవం పొందడం విశేషం. ఈ నేపథ్యంలో మహారాణిపేటలో ఉన్న బిషప్ అధికారిక భవనంలో వేడుకలు నిర్వహించారు.

వైభవంగా వరద పాయసం ఉత్సవం



సింహాచలం కొండపై పోస్తున్న పాయసం

సింహాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై ఈశాన్య దిక్కులోని వైకుంఠనారాయణుని సన్నిధిలో వరద పాయసం ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రధాన ఆలయంలో ప్రభాతారాధనలు ముగిసిన తరువాత దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులతో పాటు ఆలయ వైదిక సిబ్బంది వైకుంఠ నారాయణుని సన్నిధానానికి చేరుకున్నారు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి గంగధారను తీసుకువచ్చి పంచామృతాలతో వైకుంఠవాసునికి ప్రత్యేక స్నపన తిరుమంజనాన్ని జరిపారు. ఆలయ పండితులు విరాట్ పర్వం పారాయణ, వరుణ జపాలు చేశారు. తరువాత ఆలయ పోటుకు చెందిన కైంకర్యపరులు తయారు చేసిన పాయసాన్ని స్వామి వారికి నివేదన జరిపి దాన్ని సమీపంలోని రాతి బండపై పోశారు. ఆ పాయసాన్ని ఆరగించాలని కోరుతూ దివిలోని వరుణునికి మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. వరుణుడి ప్రసన్నంతో వర్షాలు కురుస్తాయని స్థానిక రైతుల విశ్వాసం. రాతిపై వేసిన పాయసాన్ని ప్రసాదంగా ఆలయ సిబ్బంది, రైతులు, భక్తులు స్వీకరించడం పరిపాటి. ఉత్సవం విశేషాలను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ వివరించారు. ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పరోపకారాన్నే ఇస్లాం బోధిస్తుంది: మౌలానా ఫజులు



సందేశమిస్తున్న మౌలానా ఫజులు

మహారాణిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లప్పుడూ మంచి చేస్తూ, ఇతరులకు ఉపయోగపడాలని ఇస్లాం నేర్పుతుందని, మానవాళిని గౌరవిస్తూ కలసిమెలసి ఉండాలని బోధిస్తుందని జమీయత్ అహ్లెహదీస్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ఫజులు అన్నారు. విశాఖలోని వన్‌టౌన్ డాక్టర్ దీన్ షాదీఖానాలో జమీయత్ అహ్లెహదీస్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో మౌలానా ఫజులు, రహ్మాన్ ఖురేషీ ఉమర్ హితోపదేశాలు చేశారు. శాంతియుత వాతావరణంలో ఉంటూ ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేయాలని హితవు పలికారు. పిల్లలకు విద్య, నైతికత గురించి చెప్పాలని, వారిని సంస్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో సుమారు 500 మంది సభ్యులు, ధార్మికులు పాల్గొన్నారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్

... 5వ పేజీ తరువాయి

కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈఏపీసెట్ ర్యాంకర్లకు మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సులో చేరే విద్యార్థులకు రూ.79 వేలు ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్, ఈసీఈ వంటి బ్రాంచ్‌ల మాదిరిగా ప్రత్యేక బ్రాంచ్‌గా ఈ కోర్సును నిర్వహించనున్నారు.

అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు నిర్వహణకు అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం. ఇందుకోసం కొన్ని ప్రైవేటు సంస్థల ల్యాబ్ సేవలను వర్చువల్ విధానంలో వినియోగించుకోవాలని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లు అమెజాన్, మైండ్ ట్రీ, గూగుల్ వంటి సంస్థలకున్నాయి. వాటిని వర్చువల్ విధానంలో బోధనకు వినియోగించుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహణ..

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును దేశంలోని కొన్ని విద్యా సంస్థలు ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయంటున్నారు. భవిష్యత్తు టెక్నాలజీ, ఆవిష్కరణలు దీనిచుట్టే తిరుగుతున్న నేపథ్యంలో కోర్సు నిర్వహణ వర్సిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువస్తుందని ఏయూ అధికారులు చెబుతున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఖ్యాతితేజ (33) మృతి చెందినట్టు నిర్ధారించారు. కౌశిల్‌కి ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఖ్యాతితేజ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నట్టు సమాచారం. కౌశల్ సీలింగ్ వర్క్ చేస్తుంటాడు. ఇతనికి కూడా వివాహమైంది. మాడుగుల ఎస్ఐ నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు.

ఆటోనగర్‌పైనా వైసీపీ అక్కసు!

... 5వ పేజీ తరువాయి

జిల్లా యంత్రాంగం సూచన మేరకు రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ పరిహారం కోసం సీఎఫ్ఎంఎస్ నుంచి డ్రాచేయడానికి బిల్లు (నంబరు-169977) అప్‌లోడ్ చేశారు. అయితే పరిహారానికి సంబంధించిన ఖాతాలో సొమ్ములు ఇతర అవసరాలకు మళ్లించడంతో బిల్లు పెండింగ్‌లో పడిపోయింది. ఇదే సమయంలో ఆటోనగర్ అసోసియేషన్ ఏపీఐఐసీ అధికారులను కలిసి పరిహారం పంపిణీ, ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే రైతులకు ఇవ్వాల్సిన రూ.32.64 కోట్లు కలెక్టర్ ఖాతాలో డిపాజిట్ చేశామని నివేదిస్తూ అసోసియేషన్‌కు ఏపీఐఐసీ జోనల్ మేనేజరు లేఖ పంపారు. అర్హత గల రైతులకు పరిహారం పంపిణీ కోసం రెవెన్యూ అధికారులు పెట్టిన బిల్లు సీఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్‌లో ఉందని వివరించారు. రైతులకు పరిహారం చెల్లించిన తరువాత భూమి స్వాధీనం చేసుకుని ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అయితే రైతులకు చెల్లించిన పరిహారంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని గ్రామ సర్పంచ్ ఆబోతు అప్పలరాము ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సర్వే నంబరు 50లో 157 ఎకరాలను రైతుల నుంచి సేకరించారని, వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు, రెవెన్యూ అధికారులు జాబితా నుంచి అర్హుల పేర్లు తొలగించి వైసీపీ సానుభూతిపరులను చేర్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్హులకు అందాల్సిన సుమారు 14 కోట్ల పరిహారం స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

కౌన్సెలింగ్‌లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

అభ్యంతరం తెలిపారు. కార్యదర్శుల సీనియారిటీ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి, అభ్యర్థులు కోరుకున్న సచివాలయంలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనివల్ల కౌన్సెలింగ్‌లో అక్రమాలకు తావుండదని, మూడు ఆప్షన్లు ఇస్తే ఎవరికి ఎక్కడ వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంటుందన్నారు. అయితే అధికారులు మాత్రం మూడు ఆప్షన్లు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేయడంతో కౌన్సెలింగ్‌కు హాజరైనవారంతా అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కౌన్సెలింగ్ హాల్ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం కమిషనర్ చాంబర్ ఎదురుగా ఉన్న పోర్టికో వద్ద నిరసన తెలిపారు. చివరకు కొందరు కార్యదర్శులు మూడు ఆప్షన్లతో విల్లింగ్ లెటర్‌లను అందజేయడం విశేషం.

336 మంది సర్వేయర్లు, 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఆదివారం సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో విశాఖ, అనకాపల్లి సర్వేశాఖ ఏడీలు సూర్యారావు, గోపాలరాజు ఆధ్వర్యంలో 336 మంది సర్వేయర్లకు బదిలీ చేశారు. మూడు జిల్లాల పరిధిలో బదిలీల ప్రక్రియ చేపట్టడంతో సచివాలయం ఎంపికకు ప్రతి ఉద్యోగికి ఐదు నుంచి పది నిమిషాలు పడుతోంది. దీంతో రాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగించారు. జిల్లా పరిషత్ సమావేశమందిరంలో 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ ప్రక్రియ ఉదయమే నిర్వహిస్తామని ప్రకటించడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వచ్చారు. మెరిట్ జాబితా ప్రకటించడానికి ఆలస్యమైంది. దీంతో సాయంత్రం కౌన్సెలింగ్ ప్రారంభించారు. బదిలీల్లో కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పలువురికి సిఫారసు లేఖలు ఇచ్చారు. కొందరు ఎమ్మెల్యేలు ఫోన్‌లు చేసి ఒత్తిడి తెచ్చారు. దీంతో బదిలీలపై కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అనుమానం వ్యక్తంచేశారు.

వినియోగదారుల్లో చైతన్యం

... 5వ పేజీ తరువాయి

మోసం జరిగినట్టు అనుమానమున్నా ఫిర్యాదు చేయవచ్చు. తూనికలు శాఖ అధికారులు ముద్రణతో ఇచ్చిన పరికరాలు వినియోగించకపోయినా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి లో టోల్‌ఫ్రీ నంబరు 1967 ఉంది. జిల్లాస్థాయిలో 0891 2799551 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కొన్ని గంటల్లోనే చర్యలు తీసుకుని అప్‌డేట్ సమాచారాన్ని అందిస్తాం. ప్రతి ఫిర్యాదుపైనా చర్యలుంటాయి. ఫిర్యాదు చేసే వ్యక్తి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి. ఎవరూ ప్రశ్నించకపోతే మోసాలు పెరుగుతాయి. ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకుంటే మిగిలిన వారికి భయం వస్తుంది. ప్యాకేజీ నిబంధనలపై వినియోగదారులకు అవగాహన ఉండాలి. ప్రతి ప్యాకింగ్ వస్తువుపై తప్పనిసరిగా కొన్ని వివరాలు ఉండాలి. అవి లేకపోయినా, తప్పుడు సమాచారం ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు. వస్తువు తయారుచేసిన సంస్థ, ప్యాకెట్‌లో ఉన్న ఐటెమ్, బరువు, గడువు, ధర వంటి వివరాలు ఉండాలి. ఇందులో ఏ సమాచారం లేకపోయినా, అదనపు ధర వసూలు చేసినా శిక్షార్హులు. కొత్తగా యూనిట్ సేల్ ధరను కూడా మెన్షన్ చేయాలన్న నిబంధన వచ్చింది. అంటే ఒక గ్రాము ధర ఎంత పడుతుందన్న సమాచారం తప్పనిసరిగా ముద్రించాలి. నిరుడు ఉమ్మడి జిల్లాలో 2,519 మంది కేసులు నమోదు చేశాం. ఇందులో తూనికలకు సంబంధించిన మోసాలు 1422 ఉన్నాయి. ప్యాకేజీ నిబంధనలు అమలు చేయనివారిపై 1097 కేసులున్నాయి. వాటి ద్వారా రాజీకి వసూలుచేసిన మొత్తం రూ.1.64.67,700. ముద్రణ ఫీజు కింద రూ.3,23,72,700 వసూలు చేశాం. శాఖ పరిధిలో తగిన సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం డిప్యూటీ కంట్రోలర్, విశాఖ జిల్లాలో నలుగురు అసిస్టెంట్ కంట్రోలర్స్ ఉన్నారు. వీరిలో ఇద్దరు పూర్తిగా హెచ్‌పీసీఎల్, ఐఓసీ, బీపీసీ కంపెనీల్లోని ట్యాంకులను పరిశీలిస్తారు. మిగిలిన ఇద్దరూ నగర పరిధిలో సేవలందిస్తారు. మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లున్నారు. అనకాపల్లి జిల్లాకు అసిస్టెంట్ కంట్రోలర్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరిలో నర్సీపట్నం కేంద్రంగా పనిచేసే ఇన్‌స్పెక్టర్ అల్లూరి జిల్లా బాధ్యతలను చూస్తారు. అల్లూరి జిల్లాకు ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఉన్నారు. పెట్రోలు బంకుల్లో మోసాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఇక్కడ మోసాలు డిఫరెంట్‌గా ఉంటాయి. పెట్రోల్ పోయించుకునే ముందు జీరో ఉన్నదీ? లేనిదీ చూడాలి. ఆశించిన స్థాయిలో ఫిల్ చేయలేదనిపిస్తే అక్కడే ఉన్న ఐదు లీటర్ల ట్యాంకులో ఫిల్ చేయమని కోరాలి. ప్రతి పెట్రోల్ బంకులో ఈ తరహా ట్యాంకు ఉండాలి. ట్యాంకు లేదన్నా, పెట్రోలు అందులో పోయను అన్నా ఫిర్యాదు చేయవచ్చు. వారిపై చర్యలు తీసుకుంటాం.

కాలినడకతో ఆరోగ్యానికి మేలు



వైద్య శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు ప్రతి రోజు 45 నిమిషాలు కాలినడక అలవాటు చేసుకొని పాటించాలని జీవీఎంసీ మాజీ సీఎంహెచ్ఓ డాక్టర్ పి.రమణమూర్తి సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ, క్రమం తప్పని వైద్య పరీక్షలు, సూచించిన మందులు సరిగా వాడటం ద్వారా ఆరోగ్య రక్షణ పొందవచ్చన్నారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన 204 మందికి వైద్య పరీక్షలు జరిపి, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈసీజీ, బీపీ, ఆర్థోపెడిక్ ఇబ్బందులపై పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు అందజేశారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ సభ్యులు, సీనియర్ వాకర్స్‌క్లబ్ సభ్యులు ఎస్.వరప్రసాద్ హాజరయ్యారు.

సంగీత కళా సాంస్కృతిక సంస్థ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

సీతంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శంకరమఠంలో కమలాకర కళాలయ నూతన సంగీత కళా సాంస్కృతిక సంస్థను కమలాకరరావు తనయుడు కమలాకర యోగిష్ జ్యోతి వెలిగించి ఆదివారం ప్రారంభించారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు జి.వెంకటరావు సారథ్యం వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.జలజాక్షి మాట్లాడుతూ కమలాకరరావు మృదంగ వాద్య కళాకారుడిగా సంగీత ప్రపంచానికి చేసిన కళా సేవలను కొనియాడారు. మృదంగ వాద్య నాదంలో దాగి ఉన్న మాధుర్యాన్ని సంగీత అభిమానులకు అందించిన ఘనత ఒక్క కమలాకరరావుకే దక్కుతుందన్నారు. డాక్టర్ ద్వారం త్యాగరాజు సమక్షంలో ద్వారం మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. జి.వెంకటరావు శిష్య బృందం మృదంగ లయ విన్యాసం వీనుల విందుగా సాగింది. ప్రేమ సమాజం పూర్వ కార్యదర్శి కె.జగదీశ్వరరావు, న్యాయవాది నరసింహమూర్తి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కళాభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, త్రోబాల్ క్రీడాంశాలలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీలో సీఏ చాలెంజర్స్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, సూపర్ కింగ్స్ రన్నరప్‌గా నిలిచింది. ఖోఖోలో శృతి జట్టు, త్రోబాల్‌లో మాధురి టీం, ఫుట్‌బాల్‌లో షాడో మోనార్క్ విన్నర్స్‌గా నిలిచాయి. అథ్లెటిక్స్ పురుషుల షాట్‌పుట్‌లో పుష్పక్, మహిళల విభాగంలో ప్రణీషాశ్రీ, పురుషుల 100 మీ. పరుగులో మహేంద్ర, మహిళల విభాగంలో వేద ప్రథమ స్థానం సాధించారు. టగ్ ఆఫ్ వార్ పురుషుల విభాగంలో అమన్ టీం, మహిళల్లో విష్ణుప్రియ జట్టు చాంపియన్స్‌గా నిలిచాయి. టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఎస్ఐసీఏఎస్ఏ చైర్మన్ డి.లీలా వరప్రసాద్, బ్రాంచి చైర్మన్ శ్రీధర్‌లు విజేతలను అభినందించారు.

చదరంగం పోటీలు

మురళీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాలు వేదికగా ఆదివారం ఆచార్య చెస్ అకాడెమీ అధ్వర్యంలో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.బాబూరావు, కార్యదర్శి మణికంఠ బహుమతులు అందజేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకా, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐలు రమణ, సత్యనారాయణలు మాట్లాడుతూ రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయట ప్రాంతాలకు వెళ్తేవిధిగా సమాచారం ఇవ్వాలన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. అలబోని రమణ (46) భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న రమణ రాత్రి సమయంలో బస్టాపుల్లో నిద్రపోతుంటాడు. ఇసుకతోట లాసన్స్ టవర్స్ బిల్డింగ్ వద్ద తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో రోడ్డు పక్కన నిద్రపోతుండగా, లారీ ఒకటి వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో రమణ అక్కడికక్కడే మృతి చెందాడు.అతడి సోదరుడు అలబోని అప్పలరాజు ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైసెన్సు లేని వాహనచోదకుడిపై కేసు

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ప్రమాదకరంగా నడిపిన లైసెన్సు లేని ఓ యువకుడిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ గోవిందరావు తెలిపిన వివరాల మేరకు.. ఎంవీపీ ట్రాఫిక్ ఎస్ఐ కనకారావు సిబ్బందితో కలిసి శనివారం మద్దిలపాలెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై ఇసుకతోటకు చెందిన దుండి ఉదయ్ బాబు వాహనాన్ని ప్రమాదకరంగా నడుపుతున్నట్లు గమనించి, అడ్డుకున్నారు. అతడికి లైసెన్స్ కూడా లేకపోవడంతో ఎస్ఐ కనకారావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిపై కేసు మోదు చేశారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వెంకోజీపాలెం హనుమాన్ విగ్రహం సమీపంలో వేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో బైకుపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెదవాల్తేరుకు చెందిన శోభ సీతరాజు, తన ఇంట్లో పనిచేస్తున్న కొర్ర లక్ష్మిని శనివారం ఆసుపత్రికి తీసుకువెళతుండగా ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని మెడికవర్‌కు తరలించారు. ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ఆరిలోవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షనులోని ఓ లాడ్జిలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కాకినాడకు చెందిన కుక్కల లోకనాథ్ (34) ఎంవీపీలోని సాంఘిక సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. భార్యతో కలిసి నగరంలో ఉంటున్నాడు. భార్య బుచ్చయ్యపేట మండలంలో ప్రభుత్వ ఉద్యోగిని. ఇటీవల జరుగుతున్న బదిలీల విషయమై నలుగురు సహోద్యోగులతో కలిసి హనుమంతవాక జంక్షను సమీపంలోని ఓ లాడ్జిలో దిగారు. ఆదివారం ఉదయం గుండెలో నొప్పిగా ఉందని చెప్పి లోక్‌నాథ్ దగ్గరలో మెడికల్ షాపునకు వెళ్లాడు. ఈనో ప్యాకెట్ తీసుకొని నీటిలో కలిపి తాగి పడుకున్నాడు. నిద్ర నుంచి లేవకపోవడంతో వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారని ఆరిలోవ ఎస్ఐ రామదాసు తెలిపారు.

సినిమా గైడ్

● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
● **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
● **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
● **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు)26,వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100,కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 86, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180


టూనా చేపలు


ప్యాకింగ్ చేస్తున్న మత్స్యకారులు


వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

టూనా చేపలపై మత్స్యకారుల గురి

బీచ్ రోడ్డు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విదేశీ మార్కెట్‌లో డిమాండ్ ఉండడం, అధిక రాబడి రావడంతో టూనా చేపల వేటపై బోటు ఆపరేటర్లు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్, చేపల రేవులో నిరుటితో పోలిస్తే ఈ సారి 50 బోట్లు అధికంగా ట్యూనా చేపలకు బయల్దేరి వెళ్లాయి. ఇక్కడ రేవులో 680 వరకు బోట్లు ఉంటే దాదాపు 200 వరకు టూనా చేపల వేట సాగిస్తున్నాయి. ఆ చేపలు బరువుగా ఉండడంతో సముద్రంలో లోతైన ప్రదేశాలలో మాత్రమే లభ్యమవుతాయి.వేటకు వెళ్లే బోట్లు కనీసం 20 నుంచి 25 రోజులు సముద్ర జలాల్లోనే ఉంటాయి. ఫిషింగ్ హార్బర్ నుంచి బయల్దేరి పశ్చిమబెంగాల్ సరిహద్దు వరకు వెళ్లి వేట సాగిస్తూ ఉంటారు. సాధారణ బోట్ల వలలతో టూనా చేపల వేట అసాధ్యం. వాటి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వలలు, గ్యాలం తాళ్లు, చిక్కిన చేపలను శుభ్రపరిచేందుకు, భద్రపరిచేందుకు బోట్లను సిద్ధం చేసుకోవాలి. ఈ తరహా వేట సాగించే మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తుండడంతో చాలామంది అటువైపు దృష్టి సారిస్తున్నారు.

ప్రభుత్వ రాయితీపై వెసులుబాటు

ఒక బోటు 20 రోజులు వేట సాగిస్తే 6 నుంచి 7 టన్నుల వరకు చేపల దిగుబడి వస్తుంది. కిలో ధర రూ.160 వరకు ఉంటుందని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేస్తే ధర పెరిగే అవకాశాలు ఉన్నాయని జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు.

లాంగ్ లైన్ వలల వినియోగం

తీరం నుంచి 60 కి.మీ.ల వరకు వెళ్లి వేట సాగిస్తున్నారు. 800 నుంచి 1000 గ్యాలాలు అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్న బోట్లను డీప్ సీ ఫిషింగ్‌కు అనుకూలంగా మార్చుకునేందుకు అయ్యే ఖర్చులో 40శాతం వరకు రాయితీ లభిస్తుంది.

ప్రత్యేక దృష్టి సారించాలి

ట్యూనా చేపలు పట్టుబడిన వెంటనే మెదడు, పేగులు, రెక్కలు, ముక్కులు తొలగిస్తారు. ఆ తరువాత బోట్లలో ఐస్‌తో నిండిన ప్రత్యేక గదిలో 0 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేస్తారు. అలా చేప నాణ్యతను పరిరక్షిస్తే అధిక ధర లభిస్తుంది.

విదేశాలకు ఎగుమతి

శుద్ధి చేసిన టూనా చేపలు అమెరికా, థాయిలాండ్ ఇతర యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశంలో కేరళకు పంపుతుంటారు. ఈ చేపల్లో ముళ్లు తక్కువగా ఉంటాయని, అధిక శాతం ప్రొటీన్లు ఒమేగా 3, ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు అధికంగా ఉండడంతో డిమాండ్ పెరుగుతుందని జాయింట్ డైరెక్టర్ వివరించారు.


రామలక్ష్మి అపార్ట్‌మెంట్ సమీపంలో ఆక్రమణకు గురైన గెడ్డ


పెదవాల్తేరు ఎంజీఆర్ ఆసుపత్రి సమీపంలో గెడ్డ

పెదవాల్తేరులో గెడ్డలు ఆక్రమణ

పెదవాల్తేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరు ప్రాంతం గుండా పారుతున్న గెడ్డలు ఎక్కడికక్కడ ఆక్రమణల చెరలో చిక్కాయి. దీంతో జీవీఎంసీ సుమారు రూ.50 లక్షలతో ఆధునికీకరించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ గెడ్డలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో కొన్నిచోట్ల పూడుకుపోయాయి. వర్షం కురిసినప్పుడు వరద నీరు ప్రవహించే దారిలేక పలు పల్లపు ప్రాంతాలను నీరు ముంచెత్తుతోంది. ఈ గెడ్డ ఏయూ నుంచి పోలమాంబ ఆలయం, నౌకనగర్, నౌకనగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, ఎంజీఆర్ ఆసుపత్రి, రామలక్ష్మి అపార్ట్‌మెంట్ పక్కన అన్నపూర్ణ కాంప్లెక్స్, పెదవాల్తేరు ఇందిరానగర్, ఉషోదయ నంది గుడిమీదుగా లాసన్స్ బే కాలనీ గెడ్డలో కలిసి వాసువానిపాలెం మీదుగా లాసన్స్ బే పార్కు గెడ్డ నుంచి సముద్రంలో కలుస్తాయి. ప్రస్తుతం ఈ గెడ్డలు కొన్ని ప్రాంతాల్లో 20 అడుగులు ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో రెండు అడుగులకే పరిమితమయ్యాయని, పలు ప్రాంతాల్లో స్థానికులు వాపోతున్నారు. ఈ గెడ్డ పక్కన నిర్మాణాలు చేపట్టినవారు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. వర్షం పడినప్పుడు నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు ఉండటంతో పాటు వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు పొంగి రహదారులపైకి చేరుతోంది. ఓ అపార్టుమెంటు వద్ద గెడ్డ ఆక్రమణకు గురవడంతో ఇటీవల వర్షాలకు పెదవాల్తేరులోకి వరదనీరు చేరిందని స్థానికులు వాపోయారు. దీంతో ఇటీవల జీవీఎంసీ అధికారులు సర్వే నిర్వహించి గెడ్డలు ఆక్రమణకు గురికాకుండా రక్షణగోడలు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం సుమారు రూ.50 లక్షలు కేటాయించారు. కొన్ని ప్రాంతాల్లో గెడ్డను ఆక్రమించి భవనాలకు ప్రహరీలు నిర్మించారు. దీంతో 20 అడుగుల గెడ్డ కాలువలా చిక్కిపోయింది.

రద్దు చేసిన పట్టా పునరుద్ధరణకు ప్రయత్నాలు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలంలోని రామవరంలో ఎంఐజీ టౌన్‌షిప్ కోసం భూములు సమీకరిస్తున్నారు. టౌన్‌షిప్ కోసం సేకరించిన భూములకు ఆనుకుని ఉన్న వాటికి గిరాకీ ఏర్పడింది. దీనిలో భాగంగా సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు సంబంధించి రద్దుచేసిన డీపట్టా పునరుద్ధరణకు కూటమి పార్టీకి చెందిన కొందరు నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. గ్రామానికి చెందిన ఒకరికి గతంలో అప్పటి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారు. ఈ భూమిని నగరానికి చెందిన ఒకరికి 99 ఏళ్ల లీజుకు ఇవ్వడంతో అధికారులు విచారణ చేసి 2021లో డీపట్టాను రద్దు చేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ తరువాత 2023 డిసెంబరులో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు మంజూరుకు అప్పట్లో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో 2021లో సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు రద్దు చేసిన డీపట్టాకు ఫ్రీహోల్డ్ జారీ చేయడం గత ఏడాది వెలుగులోకి రావడంతో అధికారులు స్పందించి ఫ్రీహోల్డ్‌ను రద్దు చేశారు. తాజాగా గ్రామంలో కూటమి నాయకులు కొందరు ఈ భూమికి చెందిన పట్టాను పునరుద్ధరించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది సాయం తీసుకున్నారని గ్రామానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

మాజీ ఎంపీ ఎంవీవీపై చర్యలు తీసుకోవాలని వినతి

కూర్మన్నపాలెం,జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86,87 వార్డులకు సంబంధించిన శ్మశానవాటిక స్థలం కబ్జా చేసిన ఎంవీవీ ఎంకే పార్కుకు చెందిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం విజయవాడలో మునిసిపల్ శాఖా మంత్రి డా. పొంగునూరు నారాయణకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆదివారం వినతి పత్రం అందజేశారు.సర్వే నెంబర్ 60/5లో 30 అడు గుల వెడల్పు, 600 మీటర్ల పొడవు గల శ్మశాన వాటిక ప్రహరీ గోడ, సర్వే నంబర్ 55లో సుమారు 1268 గజాలలో రహదారి, సర్వే నంబరు 58/3లో 1626 గజాల బఫర్ జోన్, టీడీఆర్ కింద 2148 గజాల స్థలంలో ఆక్రమణలుచోటు చేసుకున్నాయన్నారు. ఈ విషయమై కౌన్సిల్‌లో కూడా చర్చించినా ఎవరూ స్పందించ లేదని ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి ఆక్రమిత స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి నారాయణకు వినతి పత్రమిస్తున్న బొండా జగన్

'సౌకర్యం' ఉద్యోగి నుంచి సొమ్ము రికవరీ?

వేపగుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోనల్ కార్యాలయలోని సౌకర్యం కేంద్రంలో అవకతవకలకు పాల్పడిన సొమ్మును అధికారులు ఎట్టకేలకు రికవరీ చేసినట్టు సమాచారం. ఈ కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగి బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును పూర్తిస్థాయిలో చెల్లించకుండా అవకవతవకలకు పాల్పడినట్లు సమాచారం. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఆడిట్ విభాగంలో విచారణ చేపట్టారు.సౌకర్యం కేంద్రం ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులను పిలిపించి వివరాలు సేకరించారు. దీంతో పొరపాట్లను గుర్తించి బ్యాంకుకు చెల్లించాల్సిన రూ. 50 లక్షల వరకు సొమ్మును సంబంధిత ఉద్యోగి నుంచి వసూలు చేసినట్లు తెలిసింది.పూర్తిస్థాయి విచారణ అనంతరం సంబంధిత ఉద్యోగితో పాటు ఇందులో అలసత్వం చేసిన ఇతర ఉద్యోగులపై చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

రైలు నుంచి జారిపడి ఇద్దరికి గాయాలు

గోపాలపట్నం,జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఇద్దరి యువకులు గాయపడిన ఘటన సింహాచలం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలివి.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన పవిత్రాదాస్, సంగ్రమం దాస్ భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో రైలు సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ సమయంలో రైలు బోగి ఫుట్‌బోర్డ్ వద్ద కూర్చుని ఉన్న ఈ ఇద్దరు యువకులు ప్లాట్‌ఫారంపైన జారిపడ్డారు. వారికి గాయాలు కావడంతో వెంటనే సమీపంలో ఉన్న ఆర్పీఎఫ్ ఎస్ఐ సూరజ్‌కుమార్, హెచ్‌సీ డి.జగదీశ్ 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి'

ఎన్‌డీపీ జంక్షన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని చొరగొనే బాధ్యత ప్రభుత్వానిదేనని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు అన్నారు. స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బేసిక్ ప్రాథమిక పాఠశాలు 19 వేలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల పనివేళల్లో భోధనేతర పనులు, శిక్షణ తరగతులు లేకుండా చూడాలని సూచించారు. జిల్లా ప్రధానకార్యదర్శి టీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ను జూలై 5వరకు కొనసాగించాలన్నారు.

మద్దిలపాలెంలో వెలగని లైట్లు


చీకటిగా ఉన్న మద్దిలపాలెం రోడ్డు

మద్దిలపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23 వ వార్డు మద్దిలపాలెంలో చీకట్లు అలుముకున్నాయి. రాజేశ్వరి ఆలయం నుంచి మద్దిలపాలెం వచ్చే రహదారిలో వీధిదీపాలు మరమ్మతుకు గురవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రాజేశ్వరి ఆలయం రోడ్డు, చైతన్యనగర్ ప్రాంతాల్లో చాలా చోట్ల విద్యుత్ లైట్లు ఎప్పటి నుంచో రిపేర్లకు గురైనప్పటికీ కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. దీంతో చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణం చేస్తున్నారు. మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రహరీ వద్ద మందు బాబులు నిత్యం హల్‌చల్ చేస్తుంటారు. లైట్లు లేకపోవడంతో చీకట్లో రాకపోకలు సాగించే మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన విద్యుత్ దీపాలు అమర్చాలని కోరుతున్నారు.


కొనుగోలుదారులతో కళకళలాడుతున్న ఫిషింగ్ హార్బర్

చేపను పట్టేశా..వలను చుట్టేశా...!

- ఫిషింగ్ హార్బర్‌లో సందడి

బీచ్ రోడ్డు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం మత్స్యకారుల వలలకు పుష్కలంగా వివిధ రకాల చేపలు లభ్యమయ్యాయి. కవ్వళ్లు, పారలు, కానాకదళ్లు, రొయ్యలు తదితర రకాల చేపలు అధిక సంఖ్యలో చిక్కాయి. వేల రూపాయలు విలువ చేసే ఈ మత్స్య రాశుల కొనుగోలుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుండడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్‌కే బీచ్‌లో సందర్శకుల తాకిడి

బీచ్‌రోడ్డు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం సెలవు దినం కావడంతో ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు నగరానికి చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఆర్కే బీచ్ కిటకిటలాడింది. ఉదయం నుంచి ఎటు చూసినా సందడే.తీర ప్రాంతాల్లో సాయంత్రం వరకు పిల్లా పాపలతో ఉల్లాసంగా గడిపారు. విహారయాత్రలో భాగంగా పర్యాటకులు సముద్ర స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పోలీసులు ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సముద్రంలో స్నానాలు చేయకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

లాసన్స్ బే రోడ్డులో కంపు...కంపు!


లాసన్స్ బే కాలనీలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు

పెదవాల్తేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 19వ వార్డు లాసన్స్ బే కాలనీలో హనీ గ్రూప్ సమీపంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని, రోడ్డు నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. ఇక్కడ మలమూత్ర విసర్జన చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గంలో బాటసారులు ముక్కు మూసుకుని ముందుకు సాగాల్సిందే. ఇక్కడ నివాసితులలో చాలామంది వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాసన్స్ బే కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో శ్రీఅసంగానంద ఆశ్రమం వద్ద రోడ్డుపై వ్యర్థాలు వేయడంతో చెత్త కుప్పలను తలపిస్తోంది. వర్షాలకు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

'టీసీకి డబ్బులు అడుగుతున్నారు'

ఆరిలోవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్రకారాగారానికి సమీపంలోని అంబేద్కర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థులకు కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులయ్యాక పైచదువుల నిమిత్తం బదిలీ సర్టిఫికెట్ (టీసీ) అడిగితే ఇవ్వడానికి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కనీసం రూ.700 చెల్లిస్తే టీసీ ఇస్తామంటున్నారని, ఎందుకు ఇవ్వాలని నిలదీయగా స్కూలులో ఫ్యాన్లు పాడుచేశారంటూ అభియోగం మోపుతున్నారని పేర్కొన్నారు. గతంలో కూడా స్కూలుకు ఆలస్యంగా వస్తే రూ.300 అపరాధ రుసుము విధించి, ఆ డబ్బుతో ఫినాయిల్ తీసుకు రావాలని ఆదేశించేవారని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌ల తీరును విమర్శించారు. విద్యార్థి తండ్రి బుల్లిబాబు మాట్లాడుతూ తన కుమారుడికి పాలీసెట్‌లో ర్యాంకు వచ్చిందని, పాడేరులో ఉంటున్న తమకు ఐదు రోజులుగా టీసీ ఇవ్వడానికి తిప్పుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇన్‌చార్జి సమన్వయకర్త రామకృష్ణను ప్రశ్నించగా విద్యార్థుల టీసీలకు డబ్బులు వసూలు చేయడం నేరమన్నారు. వెంటనే టీసీలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఇగ్నో కోర్సులపై అవగాహన

ఎంవీపీ కాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం పరిధిలోని మూడు పరీక్షా కేంద్రాల్లోని విద్యార్థులకు ఇగ్నో కోర్సులపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయా కేంద్రాలను పరిశీలించిన ఇగ్నో ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు కోర్సులను వివరించారు. గాజువాక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఇగ్నో పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు.

జూకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుమారు 3,600 మంది సందర్శించారని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.3.13 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆమె తెలిపారు.

తూర్పు నౌకాదళంలో చేరిన 25 టీ బొల్లార్డ్ ఫుల్ టగ్

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నౌకాదళంలో 25టీ బొల్లార్డ్ ఫుల్ టగ్ ఆదివారం చేరింది. నేవల్ డాక్ యార్డ్ జీఎం చేతన్‌కుమార్‌సింగ్ సమక్షంలో ఈ టగ్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు టగ్‌ల నిర్మాణాలకు సంబంధించిన ఒప్పందంలో భాగంగా ఐదో టగ్‌ను టీఆర్ఎస్ఎల్ సంస్థ అందించింది. ఈ టగ్‌ను ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ (ఐఆర్ఎస్)కు అనుగుణంగా నిర్మించారు. దీనిని పరిమిత జలాల్లో నేవీ షిప్‌లు, జలాంతర్గాములకు సహాయం అందించేందుకు, రెస్క్యూ ఆపరేషన్స్ సమయంలో వినియోగిస్తుంటారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా భారత్ ప్రభుత్వం వీటిని నిర్మిస్తోంది.

అర్చకుడి స్మార్ట్ ఫోన్ తిరుపతిలో లభ్యం

- పోలీసుల అదుపులో నలుగురు ?

భీమునిపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయం అర్చకుడు ఏడిద గణేశ్ సుబ్రహ్మణ్య శర్మ ఏప్రిల్ 24న తిరుపతిలో అదృశ్యమైన విషయం తెలిసిందే. పోలీసులు నాలుగు రోజుల క్రితం తిరుపతి వెళ్లి కేసు దర్యాప్తు చేపట్టారు. అర్చకుడు వినియోగించిన స్మార్ట్ ఫోన్‌ను ఎవరికో అమ్మివేసినట్టు గుర్తించారు. ఫోన్‌ను ట్రాకింగ్‌లో పెట్టి వినియోగిస్తున్న వ్యక్తులను పట్టుకోగా, ఈ ఫోన్ మొత్తం నలుగురు చేతులు మారిందని తెలిసింది. మొదట వ్యక్తికి అర్చకుడు కేవలం రూ.700లకే ఫోన్ అమ్మేసాడని సమాచారం. ఆ తర్వాత రెండో వ్యక్తి ఆ ఫోన్‌ను రూ. 3 వేలుకు, మూడో వ్యక్తి రూ. 5 వేలుకు, నాలుగో వ్యక్తి రూ.7 వేలుకు కొనుగోలు చేసినట్టు తెలిసింది. నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని తిరుపతిలోనే విచారించారు. కాగా సిసి పుటేజీల్లో మాత్రం ఎక్కడా అర్చకుడు కనిపించకపోవడం గమనార్హం.

భీమిలి తీరానికి డాల్ఫిన్ కళేబరం



భీమునిపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : భీమునిపట్నం సముద్ర తీరానికి ఆదివారం సాయంత్రం భారీ డాల్ఫిన్ కళేబరం కొట్టుకు వచ్చింది. అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈనేపథ్యంలో భారీ డాల్ఫిన్ సముద్రంలోనే మృత్యువాతపడి, తీరానికి కొట్టుకువచ్చింది. పది అడుగుల పొడవు, మూడున్నర అడుగుల వెడల్పుతో సుమారు 700 కిలోల బరువు ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. డాల్ఫిన్‌లు చాలా అరుదుగా తీరానికి కొట్టుకువస్తాయని వారు తెలిపారు.

ఘనంగా వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు



అల్లిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం లోని వివేకానందనగర్‌లో ఉన్న సాయిశ్రీ మేరు ట్రస్ట్ సాయి దర్బార్ ప్రాంగణంలో వారాహి అమ్మవారి నవరాత్రి పూజా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి అష్టోత్తరాలు, విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొన్నారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విశేష పూజలు జరుగుతాయని, అనంతరం అమ్మవారికి హారతులిస్తామని ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ ప్రసన్న, వి.శ్రీనివాస సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వప్నప్రియ, పద్మజ, పద్మావతి, (గంధి రమా, రూపావతి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

వృద్ధుల ఇళ్ల వద్దకే రేషన్



వినియోగదారులకు రేషన్ అందజేస్తున్న కార్పొరేటర్ నాగరాజు

అల్లిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేశామని జనసేన 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. ఐదు రోజులు ముందుగానే వారి ఇంటికి వెళ్లి సరుకులు అందజేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా డీలర్ల ద్వారా నేరుగా అందించామన్నారు. గతంలో రేషన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. 30లోగా అందరికీ సరకులు పంపిణీ పూర్తవుతుందన్నారు.

ఎస్‌సీసీలో చేరికకు పరీక్షలు

సీతమ్మధార, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు సీతమ్మధారలోని ఎన్‌ఏవీఎస్ పాఠశాలలో ఆదివారం భౌతిక పరీక్షలు నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు దేహదారుఢ్య, పరుగు పందెం, వివిధ పోటీలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. 15 పాఠశాలల నుంచి 565 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోగా అందులో 370 మంది పరీక్షలో నెగ్గి ఎన్‌సీసీలో చేరికకు అర్హత సాధించారు.

నేడు రైల్వే పెన్షనర్ల మానవహారం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ సవరణ బిల్లును నిరసిస్తూ నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు మేరకు రైల్వే పెన్షనర్ల అసోసియేషన్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్, రిటైర్డ్ కోచింగ్ అసోసియేషన్ సంయుక్తంగా సోమవారం డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో మానవహారం నిర్వహించనున్నట్టు సంఘాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 10.30 గంటలకు మానవహారంగా ఏర్పడి, డిమాండ్లపై డీఆర్‌ఎం లలిత్ బొహ్రాకు వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు.

'సామాన్యుల ప్రయోజనాలే లక్ష్యంగా విధానాలు ఉండాలి'



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు సి.రామచంద్రయ్య

దాబాగార్డెన్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల ప్రయోజనాలు కేంద్ర బిందువుగా విధానాలు ఉండాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'విశాఖపట్నం అభివృద్ధి-నిధులు-సంస్కరణలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ నగరాన్ని బలవంతంగా ప్రజలకు ఉపయోగపడని రీతిలో ఎకనామిక్ గుర్తింపు ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. నగరాల్లో ఫ్లై ఓవర్లు, మెట్రో రైల్లు ఎన్ని వచ్చినా రద్దీ తగ్గదని హైదరాబాద్ అనుభవాలు తెలుపుతున్నాయన్నారు. సింగపూర్ నమూనా గురించి పదేపదే వల్లించే నేతలు అక్కడ మాదిరిగా రవాణా, మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖపట్నం రాష్ట్ర విభజన తరువాత గత పదేళ్లలో ఏ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ పోర్టులను ప్రైవేటీకరించి ప్రైవేటీకరం చేసి చార్జీలు పెంచేస్తున్నాయన్నారు. ఫ్లోర్ లీడర్ ఏజె స్టాలిన్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్పొరేషన్లకున్న ప్రాధాన్య ఇప్పుడు లేదన్నారు. సదస్సులో సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వార్డు అధ్యక్షుడు ఎన్.ప్రకాశరావు, నివాస్ కార్యదర్శి పిట్ట నారాయణమూర్తి, ఎం.జనపతున్నయ్య, పి.ఉద తదితరులు మాట్లాడారు. ముందుగా విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.పద్మ ఆహ్వానం పలకగా, ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు.

'బీసీలకు చట్టసభలో ప్రాధాన్యత అవసరం'



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

సీతంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీసీల్లో ఇప్పటివరకు అవకాశం పొందని కులాలకు చట్టసభల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయంలో పార్టీలకు అతీతంగా ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బీసీ సంఘం నాయకులు రేపు రత్నకుమారి, పావులూరి హనుమంతరావు, నాగిడి సాంబశివరావులు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప చట్టసభల్లో మాత్రం ప్రాధాన్యత కల్పించటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక శాతం ఉన్న బీసీలను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, అందరూ ఏకమై తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికార పార్టీ బీసీలకు ప్రాధాన్యత కల్పించి చట్టసభలో స్థానం కల్పించాలని కోరారు. లేకుంటే తమ హక్కుల సాధనకు పోరాటాలు చేస్తామని అన్ని పార్టీలను హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పిన్నింటి ఆదినారాయణ యాదవ్, బీసీ రమణ, వాసుపల్లి జానకిరామ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఆర్చిబిషప్‌కు అరుదైన గౌరవం



అభినందిస్తున్న దృశ్యం

మహారాణిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్ బసిలికాలో ఉడుముల బాలకు దివ్యబలి పూజ సందర్భంగా ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా 54 మంది ఆర్చిబిషప్‌లకు పాలియం అందించారు. భారతదేశం నుంచి ముగ్గురు ఆర్చిబిషప్‌లకు మాత్రమే ఈ గౌరవం దక్కగా, అందులో విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాల ఒకరు. పాలియం అనేది తెల్లని గొర్రె ఉన్నితో తయారు చేసిన ప్రత్యేక వస్త్రం. దీన్ని మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్ అధికారిక గుర్తుగా పరిగణిస్తారు. ఇది స్థానిక ఆర్చిబిషప్ పరిధిలోని ఇతర మేత్రాసనాలకు పోప్‌తో ఉండే సమైక్యతను ప్రతిబింబిస్తుంది. విశాఖ ఆర్చిపీఠాధిపతిగా ఉన్న ఉడుముల బాల ఈ గౌరవం పొందడం విశేషం. ఈ సేవ్యతలో మహారాణిపేటలో ఉన్న బిషప్ అధికారిక భవనంలో వేడుకలు నిర్వహించారు.

వైభవంగా వరద పాయసం ఉత్సవం



సింహాచలం కొండపై పోస్తున్న పాయసం

సింహాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై ఈశాన్య దిక్కులోని వైకుంఠధారయణుని సన్నిధిలో వరద పాయసం ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెలుగు ప్రధాన ఆలయంలో ప్రభాతారాధనలు ముగిసిన తరువాత దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులతో పాటు ఆలయ వైదిక సిబ్బంది వైకుంఠ నారాయణుని సన్నిధానానికి చేరుకున్నారు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి గంగధారను తీసుకువచ్చి పంచామృతాలతో వైకుంఠవాసునికి ప్రత్యేక స్నపన తిరుమంజనాన్ని జరిపారు. ఆలయ పండితులు విరాట్ పర్వం పారాయణ, వరుణ జపాలు చేశారు. తరువాత ఆలయ పోటుకు చెందిన కైంకర్యపరులు తయారు చేసిన పాయసాన్ని స్వామి వారికి నివేదన జరిపి దాన్ని సమీపంలోని రాతి బండపై పోశారు. ఆ పాయసాన్ని ఆరగించాలని కోరుతూ విరివిగా వరుణుని మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. వరుణుడి ప్రసన్నంతో వర్షాలు కురుస్తాయని స్థానిక వైదికుల విశ్వాసం. రాతిపై వేసిన పాయసాన్ని ప్రసాదంగా ఆలయ సిబ్బంది, రైతులు, భక్తులు స్వీకరించడం పరిపాటి. ఉత్సవం నిర్వహణను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ వివరించారు. ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పరోపకారాన్నే ఇస్లాం బోధిస్తుంది: మౌలానా ఫజులు



సందేశమిస్తున్న మౌలానా ఫజులు

మహారాణిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లప్పుడూ మంచి చేస్తూ, ఇతరులకు ఉపయోగపడాలని ఇస్లాం నేర్పుతుందని, మానవాళిని గౌరవిస్తూ కలిసిమెలిసి ఉండాలని బోధిస్తుందని జమీయత్ అహ్లెహదీస్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ఫజులు అన్నారు. విశాఖలోని వన్‌టౌన్ డాక్టర్ టీస్ పోర్టులో జమీయత్ అహ్లెహదీస్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో మౌలానా ఫజులు, రహ్మాన్ ఖురేషీ ఉమర్ హితోపదేశాలు చేశారు. శాంతియుత వాతావరణంలో ఉంటూ ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేయాలని హితవు పలికారు. పిల్లలకు విద్య, నైతికత గురించి చెప్పాలని, వారిని సన్మార్గంలో నడిపించాలని సూచించారు. ఈ సమావేశంలో సుమారు 500 మంది సభ్యులు, ధార్మికులు పాల్గొన్నారు.

కాలినడకతో ఆరోగ్యానికి మేలు



వైద్య శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు ప్రతి రోజు 45 నిమిషాలు కాలినడక అలవాటు చేసుకోవాలని జీవీఎంసీ మాజీ సీఎంహెచ్ఓ డాక్టర్ పి.రమణమూర్తి సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ, క్రమం తప్పని వైద్య పరీక్షలు, సూచించిన మందులు సరిగా వాడటం ద్వారా ఆరోగ్య రక్షణ పొందవచ్చన్నారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన 204 మందికి వైద్య పరీక్షలు జరిపి, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈసీజీ, బీపీ, ఆర్జీబీఎస్ ఇబ్బందులపై పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు అందజేశారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాశ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ సభ్యులు, సీనియర్ వాకర్స్‌క్లబ్ సభ్యులు ఎస్.వరప్రసాద్ హాజరయ్యారు.

సంగీత కళా సాంస్కృతిక సంస్థ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

సీతంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శంకరమఠంలో కమలాకర కళాలయ నూతన సంగీత కళా సాంస్కృతిక సంస్థను కమలాకరరావు తనయుడు కమలాకర యోగిష్ జ్యోతి వెలిగించి ఆదివారం ప్రారంభించారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు జి.వెంకటరావు సారథ్యం వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్నాటక సంగీత విద్వాంసురాలు ఎం.జయశ్రీ మాట్లాడుతూ కమలాకరరావు మృదంగ వాద్య కళాకారుడిగా సంగీత ప్రపంచానికి చేసిన కళా సేవలను కొనియాడారు. మృదంగ వాద్య నాదంలో దాగి ఉన్న మాధుర్యాన్ని సంగీత అభిమానులకు అందించిన మహత ఒక్క కమలాకరరావుకే దక్కుతుందన్నారు. డాక్టర్ ద్వారం త్యాగరాజు సమక్షంలో ద్వారం మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. జి.వెంకటరావు శిష్య బృందం ఆధ్వర్యంలో ఆలయ విన్యాసం వీనుల విందుగా సాగింది. ప్రేమ సమాజం పూర్వ కార్యదర్శి కె.జగదీశ్వరరావు, న్యాయవాది నరసింహమూర్తి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కళాభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, త్రోబాల్ క్రీడాంశాలలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీలో సీఏ చాలెంజర్స్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, సూపర్ కింగ్స్ రన్నరప్‌గా నిలిచింది. ఖోఖోలో శక్తి జట్టు, త్రోబాల్‌లో మహరిది టీం, ఫుట్‌బాల్‌లో షాడో మోనార్క్ విన్నర్స్‌గా నిలిచాయి. అథ్లెటిక్స్ పురుషుల షాట్‌పుట్‌లో ఫష్కర్, మహిళల విభాగంలో ప్రణీష్మ, పురుషుల 100 మీ. పరుగులో మహేంద్ర, మహిళల విభాగంలో వేద ప్రథమ స్థానం సాధించారు. టగ్ ఆఫ్ వార్ పురుషుల విభాగంలో అమన్ టీం, మహిళల్లో విష్ణుప్రియ జట్టు చాంపియన్స్‌గా నిలిచాయి. టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఎస్ఐసీఏఎస్ఏ చైర్మన్ డి.లీల వరప్రసాద్, (ట్రావెల్) చైర్మన్ (కృష్ణ) విజేతలను అభినందించారు.

చదరంగం పోటీలు

మురళీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఓ పంక్షన్ హాలు వేదికగా ఆదివారం ఆచార్య చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.బాబూరావు, కార్యదర్శి మాణిక్యం బహుమతులు అందజేశారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్

... 5వ పేజీ తరువాయి

కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈఏపీసెట్ ర్యాంకర్లకు మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సులో చేరే విద్యార్థులకు రూ.79 వేలు ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్, ఈసీఈ వంటి బ్రాంచ్ మాదిరిగా ప్రత్యేక బ్రాంచ్‌గా ఈ కోర్సును నిర్వహించనున్నారు.

అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు నిర్వహణకు అత్యాధునిక ల్యాబ్‌లు అవసరం. ఇందుకోసం కొన్ని ప్రైవేటు సంస్థల ల్యాబ్ సేవలను వర్సిటీ వినియోగించుకోవాలని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లు అమెజాన్, మైండ్ ట్రీ, గూగుల్ వంటి సంస్థలకున్నాయి. వాటిని వర్సిటీ విద్యార్థులకు బోధనకు వినియోగించుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహణ..

క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును దేశంలోని కొన్ని విద్యా సంస్థలు ఇంటిగ్రేటెడ్ కోర్సుగా నిర్వహిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయంటున్నారు. భవిష్యత్తు టెక్నాలజీ, ఆవిష్కరణలు దీనిపైనే తిరుగుతున్న నేపథ్యంలో కోర్సు నిర్వహణ వర్సిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువస్తుందని ఏయూ అధికారులు చెబుతున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి జ్యోతితేజ (33) మృతి చెందినట్టు నిర్ధారించారు. కోటక్ ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. జ్యోతితేజ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నట్టు సమాచారం. కోటక్ సీలింగ్ వర్క్స్ చేస్తుంటాడు. ఆతనికి కూడా వివాహమైంది. మాడుగుల ఎస్ఐ నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు.

ఆటోనగర్‌పైనా వైసీపీ అక్కసు!

... 5వ పేజీ తరువాయి

జిల్లా యంత్రాంగం సూచన మేరకు రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ పరిహారం కోసం సీపీఎంఎస్ నుంచి ప్రాధేయపడినా బిల్లు (నంబరు-169977) అప్‌లోడ్ చేశారు. ఆయితే పరిహారానికి సంబంధించిన ఖాతాలో సొమ్ములు ఇతర అవసరాలకు మళ్లించడంతో బిల్లు పెండింగ్‌లో పడిపోయింది. ఇదే సమయంలో ఆటోనగర్ అసోసియేషన్ ఏపీఐఐసీ అధికారులను కలిసి పరిహారం పంపిణీ, ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయితే రైతులకు ఇవ్వాల్సిన రూ.32.64 కోట్లు కలెక్టర్ ఖాతాలో డిపాజిట్ చేశామని నివేదిస్తూ ఆసోసియేషన్‌కు ఏపీఐఐసీ జోనల్ మేనేజరు లేఖ పంపారు. ఆర్థిక గత రైతులకు పరిహారం పంపిణీ కోసం రెవెన్యూ అధికారులు పెట్టిన బిల్లు సీఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్‌లో ఉందని వివరించారు. రైతులకు పరిహారం చెల్లించిన తరువాత భూమి స్వాధీనం చేసుకుని ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆయితే రైతులకు చెల్లించిన పరిహారంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని గ్రామ సర్పంచ్ ఆకోటు అప్పలరాము ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సర్వే నంబరు 50లో 157 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు, రెవెన్యూ అధికారులు జాబితా నుంచి అర్హుల పేర్లు తొలగించి వైసీపీ సానుభూతిపరులు చేర్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్హులకు అందాల్సిన సుమారు 14 కోట్ల పరిహారం స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

కౌన్సెలింగ్‌లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

అభ్యంతరం తెలిపారు. కార్యదర్శుల సీనియారిటీ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి, అభ్యర్థులు కోరుకున్న సచివాలయంలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనివల్ల కౌన్సెలింగ్‌లో అక్రమాలకు తావుండదని, మూడు ఆప్షన్లు ఇస్తే ఎవరికి ఎక్కడ వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంటుందన్నారు. ఆయితే అధికారులు మాత్రం మూడు ఆప్షన్లు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేయడంతో కౌన్సెలింగ్‌కు హాజరైన వారంతా అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కౌన్సెలింగ్ హాల్ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం కమిషనర్ చాంబర్ ఎదురుగా ఉన్న పోర్టికో వద్ద నిరసన తెలిపారు. చివరకు కొందరు కార్యదర్శులు మూడు ఆప్షన్లతో విల్లింగ్ లెటర్‌లను అందజేయడం విశేషం. లయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఆదివారం సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో విశాఖ, అనకాపల్లి సర్వేశాఖ ఏడీలు సూర్యారావు/గోపాలరాజు ఆధ్వర్యంలో 336 మంది సర్వేయర్లకు బదిలీ చేశారు. మూడు జిల్లాల పరిధిలో బదిలీల ప్రక్రియ చేపట్టడంతో సచివాలయం ఎంపికకు ప్రతి ఉద్యోగికి ఐదు నుంచి పది నిమిషాలు పట్టిందని, దీంతో రాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగించారు. జిల్లా పరిషత్ సమావేశమందిరంలో 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ ప్రక్రియ ఉదయమే నిర్వహిస్తామని ప్రకటించడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వచ్చారు. మెరిట్ జాబితా ప్రకటించడానికి ఆలస్యమైంది. దీంతో సాయంత్రం కౌన్సెలింగ్ ప్రారంభించారు. బదిలీల్లో కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పలువురికి సిఫారసు లేఖలు ఇచ్చారు. కొందరు ఎమ్మెల్యేలు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. దీంతో బదిలీలపై కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అనుమానం వ్యక్తంచేశారు.

336 మంది సర్వేయర్లు, 443 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన గ్రామ, వార్డు సచివా

వినియోగదారుల్లో చైతన్యం

... 5వ పేజీ తరువాయి

మోసం జరిగినట్టు అనుమానమున్నా ఫిర్యాదు చేయవచ్చు. తూనికలు శాఖ అధికారులు ముద్రలతో ఇచ్చిన పరికరాలు వినియోగించకపోయినా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి లో టోల్‌ఫ్రీ నంబరు 1967 ఉంది. జిల్లాస్థాయిలో 0891 2799551 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కన్ని గంటల్లోనే చర్యలు తీసుకుని అవసరమైన సమాచారాన్ని అందిస్తాం. ప్రతి ఫిర్యాదుపైనా చర్యలుంటాయి. ఫిర్యాదు చేసే వ్యక్తి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి. ఎవరూ ప్రశ్నించకపోతే మోసాలు పెరుగుతాయి. ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకుంటే మిగిలిన వారికి భయం వస్తుంది. ప్యాకేజీ కమోడిటీస్‌పై వినియోగదారులకు అవగాహన ఉండాలి. ప్రతి ప్యాకింగ్ వస్తువుపై తప్పనిసరిగా కొన్ని వివరాలు ఉండాలి. అవి లేకపోయినా, తప్పుడు సమాచారం ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు. వస్తువు తయారుచేసిన సంస్థ, ప్యాకెట్‌లో ఉన్న బరువు, బరువు, గడువు, ధర వంటి వివరాలు ఉండాలి. ఇందులో ఏ సమాచారం లేకపోయినా, అదనపు ధర వసూలు చేసినా శిక్షార్హులు. కొత్తగా యూనిట్ సేల్ ధర కూడా మెన్షన్ చేయాల్సిన నిబంధన వచ్చింది. అంటే ఒక గ్రాము ధర ఎంత పడుతుందన్న సమాచారం తప్పనిసరిగా ముద్రించాలి. నిరుడు ఉమ్మడి జిల్లాలో 2,519 మంది కేసులు నమోదు చేశాం. ఇందులో తూనికలకు సంబంధించిన మోసాలు 1422 ఉన్నాయి. ప్యాకేజీ నిబంధనలు అమలు చేయనివారిపై 1097 కేసులున్నాయి. వాటి ద్వారా రాజీకి అవకాశమిచ్చి ముద్రణ ఫీజు కింద రూ.1,64,67,700, ముద్రణ ఫీజు కింద రూ.3,23,72,700 వసూలు చేశాం. శాఖ పరిధిలో తగిన సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం డిప్యూటీ కంట్రోలర్, విశాఖ జిల్లాలో నలుగురు అసిస్టెంట్ కంట్రోలర్లు ఉన్నారు. వీరిలో ఇద్దరు పట్టణ స్థాయిలో హెచ్‌పీసీఎల్, ఐవోసీ, బీపీసీఎల్ కంపెనీల్లోని ట్యాంకులను పరిశీలిస్తారు. మిగిలిన ఇద్దరు నగర పరిధిలో సేవలందిస్తారు. మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లున్నారు. అనకాపల్లి జిల్లాకు అసిస్టెంట్ కంట్రోలర్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరిలో నర్సీపట్నం కేంద్రంగా పనిచేసే ఇన్‌స్పెక్టర్ అల్లూరి జిల్లా బాధ్యతలను చూస్తారు. అల్లూరి జిల్లాకు ఒక అసిస్టెంట్ కంట్రోలర్ ఉన్నారు. పెట్రోల్ బంకుల్లో మోసాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఇక్కడ మోసాలు డిఫరెంట్‌గా ఉంటాయి. పెట్రోల్ పోయించుకునే ముందు జీరో ఉన్నదీ? లేనిదీ చూడాలి. అలాగే చాలామంది ఇంధనం కోసం దరిపెట్టే అక్కడే ఉన్న ఐదు లీటర్ల ట్యాంకులో ఫిల్ చేయమని కోరాలి. ప్రతి పెట్రోల్ బంకులో ఈ తరహా ట్యాంకు ఉంటుంది. ట్యాంకు నిండా పెట్రోల్ లేకుంటే అందులో పోయను అన్నా ఫిర్యాదు చేయవచ్చు. వారిపై చర్యలు తీసుకుంటాం.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకా, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐలు రమణ, సత్యనారాయణలు మాట్లాడుతూ పోలీసులు ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు.



ఎంపీ ఎంవీవీపై చర్యలు తీసుకోవాలని వినతి



మంత్రి నారాయణకు వినతి పత్రమిస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం,జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86,87 వార్డులకు సంబంధించిన శ్మశానవాటిక స్థలం కబ్జా చేసిన ఎంవీవీ ఎంకే పార్కుకు చెందిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం విజయవాడలో మున్సిపల్ శాఖా మంత్రి డా. పొంగునూరు నారాయణకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆదివారం వినతి పత్రం అందజేశారు.సర్వే నెంబర్ 60/5లో 30 అడుగుల వెడల్పు, 600 మీటర్ల పొడవు గల శ్మశాన వాటిక ప్రహరీ గోడ, సర్వే నంబర్ 55లో సుమారు 1268 గజాలలో రహదారి, సర్వే నంబరు 58/3లో 1626 గజాల బఫర్ జోన్, టీడీఆర్ కింద 2148 గజాల స్థలంలో ఆక్రమణలుచోటు చేసుకున్నాయన్నారు. ఈ విషయమై కౌన్సిల్‌లో కూడా చర్చించినా ఎవరూ స్పందించ లేదని ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి ఆక్రమిత స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలిథిన్ నిషేధంపై అవగాహన



చేపలను స్టీలు బాక్సుల్లో తీసుకు వెళ్తున్న కాలనీ వాసులు

కూర్మన్నపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు తిరుమల నగర్‌లో కాలనీ వాసులు ఆదివారం ప్లాస్టిక్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు నాగభూషణం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వద్దు, గుడ్డ సంచులే ముద్దు, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటండి, చేపల, మాంసం మార్కెట్‌లకు విధిగా స్టీలు బాక్సులు, నార సంచులను తీసుకువెళ్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, వసంత రెడ్డి, తదితర కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెందుర్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. టెన్త్ పూర్తయిన 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సిల్వర్ జుబ్లీ వేడుకల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటిజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. సాయంత్రం వరకూ ఆటపాటలో సందడి చేశారు. అప్పట్లో విద్యా బోధన చేసిన ఉపాధ్యాయ గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నిత్యావసర సరకులు అందజేత

అగనంపూడి. జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, పరిసర ప్రాంత గ్రామాల్లో బొర్రమాంబ పారాయణ సేవాసమితి ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం గొల్లలపాలెం వేద పాఠశాలలోని పేద విద్యార్థులకు పలు నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా సేవాసమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో శోభారాణి, బలిరెడ్డి వెంకటలక్ష్మి, జానకీదేవి, గుర్రం లక్ష్మి, రామాదేవి, కళా, పార్వతి, ఆదిలక్ష్మి, రాజేశ్వరి, సరోజిని, శిరీష, బాల, చంద్రకాంతం, తులసీ, ఇంద్రజ, నూకరత్నం పాల్గొన్నారు.

గ్రీన్‌లాండ్ పార్కులో స్వచ్ఛ భారత్

కూర్మన్నపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 86 వ వార్డు ఉడా ఫేజ్-6 కాలనీ వాసులు గ్రీన్‌లాండ్ పార్కులో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు దామా సుబ్బారావు, అమిరెడ్డి మురళీధర రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ పార్కులలో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. గోగినేని మల్లికార్జున రావు,గుడ్ల కుమార్, బాలాజీ, వెంకట్రావు, బాబూ నాయక్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సింహాచలం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు

- అమృత్ భారత్ పథకంలో రూ. 19.5 కోట్లు మంజూరు
- అదనపు ఫ్లాట్ ఫారాలు, ముఖద్వారం పనులు



స్టేషన్ ప్రాంగణంలో నూతన భవనం

గోపాలపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంతో ప్రాధాన్యం గల సింహాచలం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ను రూ. 19.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం 25 రైళ్లు మాత్ర మే స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్ని ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన సింహాచలంనకు వచ్చే భక్తులు కూడా నగరంలోని ప్రధాన స్టేషన్‌కు వెళ్లి తిరిగి వెనక్కి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్టేషన్‌ను అమృత్ భారత్‌లో భాగంగా ఆధునికీకరణకు ఎంపిక చేయడంతో త్వరలో స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

ఆధునికీకరణ పనుల్లో భాగంగా స్టేషన్ ప్రారంభంలో ఉన్న భవనాన్ని పూర్తిగా తొలగించి ఆధ్యాత్మి క త ఉట్టిపడే విధంగా ఆలయ గోపురం నమూనాతో కొత్తగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న రెండు ప్లాట్ ఫారాలతో పాటు అదనంగా మరొక రెండు లైన్లు నిర్మించి ప్లాట్ ఫారాల సౌకర్యం కల్పించనున్నారు. స్టేషన్ ప్రాంగణం నుంచి ప్రయాణికులు ప్రధాన రహదారికి నేరుగా బీఆర్‌టీఎస్ రహదారిని చేరుకునే విధంగా పనులు చేపడుతున్నారు. స్టేషన్‌కు వచ్చి పోయే ప్రయాణీకులు రాకపోకలకు వీలుగా అదనంగా మరో ఫుట్‌ఓవర్ వంతెన నిర్మిస్తున్నారు. ఈ పనులన్నీపూర్తయితే ప్రయాణికులతో పాటు అప్పన్న దర్శనానికి దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యం కలగనుంది. దీంతోపాటు స్టేషన్ పరిసర ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

వైసీపీ అరాచక రాజకీయాలను ఎండగట్టండి

- టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రసాదుల రామకృష్ణ

గాజువాక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రజారంజకమైన పరిపాలన చూసి ఓర్వలేని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి శవరాజకీయాలకు పాల్పడుతున్నారని టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించి, పెట్టుబడులు రా కుండా చేయటానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వీటిని ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. వైసీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఏడాది పాలనలో ప్రజలు ఎంతో సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు.కార్యక్రమంలో నాయకులు పె ద్దాడ సోమినాయుడు, శ్రీనివాస్, పెరుమాళ్లు, అప్పలస్వామి, రమణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీలకు ఆహ్వానం

పెదగంట్యాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌టాచ్) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో సీటీ లెవెల్ క్విజ్-2025 పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ కన్వీనర్ డాక్టర్ డి. రాజశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలపై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు ఈ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 1న ఎంవీపీ కాలనీలోని అవార్డ్ పబ్లిక్ స్కూల్‌లో ఈ పోటీలు జరుగనున్నాయని, జూలై 20తేదీలోగా తమ పేర్లను స్కూల్ ప్రిన్సిపాళ్ల వద్ద నమోదు చేసుకోవాలన్నారు.వివరాలకు ఫోన్లు: 98481 98701, 9849117400 సంప్రదించాలని కోరారు.

ఉద్యోగ విరమణ చేసిన నేతకు సత్కారం



హరినాథ్‌ను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

అగనంపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగంలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఐఎన్‌టీయూసీ నేత పెదిరెడ్ల హరనాథ్‌ను స్థానిక సీడబ్ల్యూసీలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పైడి వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. ప్లాంట్ పురోభివృద్ధిలో హరినాథ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శీరంశెట్టి గోవిందరావు, మొటూరి వెంకటరమణ, మజ్జి శ్రీను, మడగల నరసింగరావు, అప్పలరాజు, నీలకంఠరావు, బుదిరెడ్డి అప్పారావు, నక్కా రామ్మూర్తి, కరణం అప్పారావు, రమణ పాల్గొన్నారు.

కార్మిక సంఘ నాయకుడికి సన్మానం

ఉక్కుటౌన్‌షిప్: కార్మిక సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న గుర్తింపు యూనియన్ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణను నాయకులు ఆదివారం టౌన్‌షిప్‌లో సత్కరించారు. ఈ సందర్భంగ పలువురు నాయకులు ఆయన సేవలందిస్తున్నారన్నారు. నాయకులు మసేన్‌రావు, యేల్లేటి శ్రీనివాసరావు, డోక్కా నర్సింగరావు, గోవిందరెడ్డి, పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వామినాయుడు మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్లో హాజరవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పల్పడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఆనందంగా జీవించాలన్నారు.

వరాహావతారంలో జగన్నాథస్వామి దర్శనం



స్టీల్ ప్లాంట్ ఆలయంలో పూజలందుకుంటున్న జగన్నాథస్వామి



అగనంపూడిలో వరాహావతారంలో స్వామివారు

అగనంపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగన్నాథ స్వామి ఆదివారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రజ్యుమ్న మందిరంలో కొలువుదీరిన జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలను అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు విష్ణుసహస్రనామ పారాయణ చేపట్టారు. వేంకటేశ్వర భక్త మండలివారు భజన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఆలయ ఈవో పద్మావతి, 79వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కరణం జగదీశ్, రామకృష్ణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ జగన్నాథ స్వా మివారికి ఆదివారం ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావటంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

పెందుర్తిరూరల్: చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని గీతా కృష్ణ మందిరంలో ఉన్న జగన్నాథస్వామి ఆదివారం ఆది వరాహావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బాలవికాశ్ పిల్లలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కార్పొరేటర్ దృష్టికి సమస్యలు



68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూషకు సమస్యలు వివరిస్తున్న యువకులు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : అక్కిరెడ్డిపాలెం కాలనీలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేయాలని 68 వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూషకు కాలనీ యువకులు కోరారు. వార్డు వైసీపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సంగ్రాన నూకరాజు ఆధ్వర్యంలో కాలనీ యువకులు ఆదివారం వార్డు కార్పొరేటర్ ను కలసి కాలనీ అభివృద్ధిపై చర్చించారు. యువకులు వరదాడ వెంకటరమణ, సయ్యద్ హుస్సేన్, నంబారు రాజు, సంగ్రాన శ్రీను, కర్రి శ్రీను, పూడి శాంతి తదితరులున్నారు.

'సౌకర్యం' ఉద్యోగి నుంచి సొమ్ము రికవరీ?

వేపగుంట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రంలో ఓ ఉద్యోగి అవకతవకలకుపాల్పడిన సొమ్మును అధికారులు ఎట్టకేలకు రికవరీ చేసినట్టు సమాచారం. ఈ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగి బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును పూర్తిస్థాయిలో చెల్లించకుండా అవకవతవకలకు పాల్పడినట్లు సమాచారం. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఆడిట్ విభాగంలో విచారణ చేపట్టారు. సౌకర్యం కేంద్రం ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులను పిలిపించి వివరాలు సేకరించారు. దీంతో పొరపాట్లను గుర్తించి బ్యాంకుకు చెల్లించాల్సిన దాదాపు రూ. 50లక్షల వరకు సొమ్మును ఎట్టకేలకు సంబంధిత ఉద్యోగినుంచి వసూలు చేసినట్లు తెలిసింది. పూర్తిస్థాయి విచారణ అనంతరం సంబంధిత ఉద్యోగితోపాటు, ఈ అంశంలో అలసత్వం చేసిన ఇతర ఉద్యోగులపై చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

రైలు నుంచి జారిపడి ఇద్దరికి గాయాలు

గోపాలపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఇద్దరి యువకులు గాయపడిన ఘటన సింహాచలం రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలివి.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన పవిత్రాదాస్, సంగ్రమం దాస్ భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో రైలు సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ సమయంలో రైలుబోగి ఫుట్ బోర్డ్ వద్ద కూర్చుని ఉన్న ఈ ఇద్దరు యువకులు ప్లాట్‌ఫారంపైన జారిపడ్డారు. దీంతో వీరికి గాయాలు కావడంతో వెంటనే సమీపంలో ఉన్న ఆర్పీఎఫ్ ఎస్ఐ సూరజ్‌కుమార్, హెచ్‌సీ డి.జగదీశ్ 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

రద్దు చేసిన పట్టా పునరుద్ధరణకు ప్రయత్నాలు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలంలోని రామవరంలో ఎంఐజీ టౌన్‌షిప్ కోసం భూములు సమీకరిస్తున్నారు. టౌన్‌షిప్ కోసం సేకరించిన భూములకు ఆనుకుని ఉన్న వాటికి గిరాకీ ఏర్పడింది. దీనిలో భాగంగా సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు సంబంధించి రద్దుచేసిన డీపట్టా పునరుద్ధరణకు కూటమి పార్టీకి చెందిన కొందరు నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. గ్రామానికి చెందిన ఒకరికి గతంలో అప్పటి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారు. ఈ భూమిని నగరానికి చెందిన ఒకరికి 99 ఏళ్ల లీజుకు ఇవ్వడంతో అధికారులు విచారణ చేసి 2021లో డీపట్టాను రద్దుచేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ తరువాత 2023 డిసెంబరులో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు మంజూరుకు అప్పట్లో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో 2021లో సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు రద్దు చేసిన డీపట్టాకు ఫ్రీహోల్డ్ జారీ చేయడం గత ఏడాది వెలుగులోకి రావడంతో అధికారులు స్పందించి ఫ్రీహోల్డ్‌ను రద్దు చేశారు. తాజాగా గ్రామంలో కూటమి నాయకులు కొందరు ఈ భూమికి చెందిన పట్టాను పునరుద్ధరించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది సాయం తీసుకున్నారని గ్రామానికి చెందిన కొందరు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అగనంపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలో చేపడుతున్న రామాలయం నిర్మాణానికి ఉక్కు విశ్రాంతి ఉద్యోగి కొలిపాక అప్పారావు రూ. 25, 678 విరాళంగా ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విందుల సతీశ్, విందుల చిరురాజు, దానబాల అప్పలనాయుడు, సూర్యారావు, వరహాలు, గుదే అప్పలరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు

పెందుర్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు స్థానిక సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పెందుర్తి, చినముషిడివాడలలో దాడులు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు(తెలుపు) 26,వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60,బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 86, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 18, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180

వైసీపీకి దూరంగా ఉంటా..: దామా సుబ్బారావు



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దామా సుబ్బారావు

కూర్మన్నపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకలాపాలకు ఇకపై దూరంగా ఉంటానని ఆ పార్టీ నాయకుడు దామా సుబ్బారావు తెలిపారు. కూర్మన్నపాలెంలో ఆదివారం ఆయన తన అనుచరులు, అభిమానుల సమక్షంలో వైసీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ వచ్చానన్నారు. కానీ ఆ పార్టీ అధిష్ఠానం తనను చిన్నచూపు చూసినట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ సీఈసీ సభ్యునిగా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అదనపు కార్యదర్శిగా పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తే, మాజీ ఎమ్మెల్యే వార్డు టీడీపీ కార్పొరేటర్ కుమారుడికి రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పదవినిచ్చి తనను కించపరిచారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో విసుగు చెంది వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపతిరా జు శ్రీనివాసరాజు, వాడపల్లి రామచంద్రరాజు, మెడికల్ బాబు, మాటూరి శ్రీనివాస్, చేగొండి శ్రీనివాస్, చిట్టి దేముడు, పత్తిపాటి శ్రీను, ప్రసాద్, అల్లావుద్దీన్, శ్రీనివాస్ పట్నాయిక్, తుంపాల లక్ష్మణ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

పెదగంట్యాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో గ్రంథాలయాధికారి పీవీ రమణ నీతి కథలు చదివించారు. పరవస్తు చిన్నయసూరి రచించిన నీతి చంద్రికలోని వివిధ భాగాలను విద్యార్థులకు పరిచయం చేశారు.

'రాజ్యాధికారం దిశగా ఎంఆర్‌పీఎస్: నేత ఏలిషా మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఏలీషా మాదిగ

మల్కాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం దిశగా ఎంఆర్‌పీఎస్ మాదిగ, మాదిగ ఉపకులాలతో పాటు ఎస్సీలు, బీసీలు, అగ్రవర్ణ పేదలను కలుపుకుని రాజ్యాధికారం దిశగా ముందుకు సాగుతున్నట్టు ఎంఆర్‌సపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, విశాఖపట్నం ఇన్‌చార్జి పెరెల్లి ఏలిషా మాదిగ అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ అరుధంతీ సంక్షేమ సంఘంలో ఆదివారం ఉదయం జరిగిన పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలోనే ప్రైవేటు కంపెనీలలో కూడా రిజర్వేషన్లు అమలయ్యేలా కృష్ణమాదిగ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. జూలై 7వ తేదీన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థపక దినోత్సవం ఘనంగా జరపాలని కోరారు. ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కింతాడ రాజశేఖర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజూరి దీపక్, నాయకులు కడితి సాధురావు, పెట్ల రమణ, బాదం హనుమంతురావు, పాల్గొన్నారు.

ప్రాచీన కళలను ప్రోత్సహించాలి



ప్రదర్శనను ప్రారంభిస్తున్న జీఎం (హెచ్‌ఆర్) మధుసూదనరావు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ప్రాచీన కళలను ప్రోత్సహించాలని జీఎం (హెచ్‌ఆర్) ఎం.మధుసూదనరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీడబ్ల్యూసీ-1లో ఏర్పాటు చేసిన ప్రాచీక కళల ప్రదర్శనను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాచీన సంప్రదాయాలు ఉట్టి పడేలా ఈ ప్రదర్శన ఏర్పాటుపై అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శ డోక్కా నర్సింగరావు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్.రావు, మసేన్‌రావు, త్రినాథ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

తూర్పు నౌకాదళంలో చేరిన 25 టీ బొల్లార్డ్ ఫుల్ టగ్



25 టీ బొల్లార్డ్ ఫుల్ టగ్

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళంలో 25టీ బొల్లార్డ్ ఫుల్ టగ్ ఆదివారం చేరింది. నేవల్ డాక్ యార్డ్ జీఎం చేతన్‌కుమార్‌సింగ్ సమక్షంలో ఈ టగ్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు టగ్‌ల నిర్మాణాలకు సంబంధించిన ఒప్పందంలో భాగంగా ఐదో టగ్‌ను టీఆర్ఎస్ఎల్ సంస్థ అందించింది. ఈ టగ్‌ను ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ (ఐఆర్ఎస్)కు అనుగుణంగా నిర్మించారు. దీనిని పరిమిత జలాల్లో నేవీ షిప్‌లు, జలాంతర్గాములకు సహాయం అందించేందుకు, రెస్క్యూ ఆపరేషన్స్ సమయంలో వినియోగిస్తుంటారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా భారత్ ప్రభుత్వం వీటిని నిర్మిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి: యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ కోశాధికారి మోహనరావు

ఎన్‌డీఏ జంక్షన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని చూరగొనే బాధ్యత ప్రభుత్వానిదేనని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు అన్నారు. స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బేసిక్ ప్రాథమిక పాఠశాలు 19వేలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల పనివేళల్లో బోధనేతర పనులు, శిక్షణ తరగతులు లేకుండా చూడాలని సూచించారు. జిల్లా ప్రధానకార్యదర్శి టీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ను జూలై 5 వరకు కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, సహాధ్యక్షుడు ఎస్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారి క.రాంబాబు, టి.అప్పారావు, చుక్క సత్యం, రిజ్వాన్, రియాజ్, బి.జనార్దన్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.